పోలీసు బాస్‌కు నేరుగా ఫోన్ చేయొచ్చు!

భీమునిపట్నం, న్యూస్‌టుడే: పోలీసు స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల స్థానిక యంత్రాంగం సరిగా స్పందించకపోతే ఇకపై విశాఖ నగర పోలీసు కమిషనరుకు నేరుగా ఫిర్యాదు చేసి న్యాయం పొందేందుకు సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ అవకాశాన్ని కల్పించారు. విశాఖ పోలీసు కమిషనరు కార్యాలయంలో ప్రతీ సోమవారం జరిగే పీజీఆర్‌ఎస్‌లో నేరుగా ఆయనకు విన్నవించవచ్చు. అంతే కాకుండా తప్పని పరిస్థితుల్లో ఎవరైనా నేరుగా ఫోన్ చేసేందుకు ఆయన తన చరవాణి సంఖ్య 79950 95799 విడుదల చేశారు. అయితే ఈ విషయం ప్రజలకు ప్రత్యక్షంగా తెలియజేసేందుకు స్థానిక పోలీసు అధికారులు భీమిలి స్టేషన్ వద్ద పోలీసు కమిషనర్ పేరిట ఆయన చరవాణి సంఖ్యతో కూడిన బోర్డు తాజాగా ఏర్పాటు చేశారు. ఇప్పటికే పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లను ఆకస్మికంగా సందర్శిస్తూ అక్కడి సిబ్బంది పనితీరుపై ఫిర్యాదిదారులను అడిగి తెలుసుకుంటున్నారు. పోలీసు యంత్రాంగాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు సీపీ తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. దీనివల్ల స్థానిక పోలీసు విభాగం మరింత బాధ్యతాయుతంగా పనిచేసే అవకాశం ఉంటుందని పలువురు భావిస్తున్నారు.



భీమిలి పోలీసు స్టేషన్ వద్ద సీపీ శంఖబ్రత బాగ్చీ చరవాణి నంబరుతో కూడిన బోర్డు

వ్యూహం ఎందరిదో.. దక్కింది కొందరికే!!



లాటరీలో దుకాణం దక్కిన వారు నగదు చెల్లిస్తూ...



నగదును లెక్కిస్తున్న సిబ్బంది



లాటరీ ప్రక్రియకు హాజరైన దరఖాస్తుదారులు

★ జిల్లాలో పూర్తయిన మద్యం దుకాణాల కేటాయింపు
★ లాటరీలో మహిళలకు దక్కినవి 31

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, మాధవధార, ఎంవీపీకాలనీ

విశాఖ జిల్లాలో మద్యం దుకాణాల లైసెన్సుల జారీకి సోమవారం నిర్వహించిన లాటరీ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మొత్తంగా 155 దుకాణాలకు 4,129 మంది దరఖాస్తులు రాగా 155 మందిని లాటరీ ద్వారా ఎంపిక చేశారు. వీఎంఆర్‌డీఏ బాలల ప్రాంగణంలో లాటరీ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభించగా మధ్యాహ్నం ఒంటి గంటకు పూర్తయింది. కలెక్టరు హరేంధిర ప్రసాద్ మొదటి లాటరీ తీశారు. ఆ తర్వాత సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ ఆధ్వర్యంలో కొనసాగించారు. దుకాణాలకు వచ్చిన దరఖాస్తులు ఆధారంగా అన్ని నంబర్లను డబ్బాలో వేసి వాటిలో నుంచి ఒకటి తీసి ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఎంపికైన వారు రాకుంటే రిజర్వులో మరో ఇద్దర్ని ఎంపిక చేశారు. ఇదంతా దరఖాస్తుదారుల సమక్షంలోనే సజావుగా నిర్వహించారు. లాటరీలో ఎంపికైన వారి వివరాలు తీసుకొని నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన మొదటి విడత డబ్బులను అక్కడే చెల్లించేలా ఏర్పాట్లు చేశారు. ఎక్సైజ్ శాఖ డీసీ శ్రీరామచంద్రమూర్తి, జిల్లా పర్యవేక్షకులు ఆర్.ప్రసాద్ పర్యవేక్షించారు.



లాటరీకి వచ్చిన మహిళలు

▸▸ **ఇతర జిల్లాల నుంచి:** విశాఖ జిల్లాలో మద్యం దుకాణాల లైసెన్స్ కోసం రాష్ట్రేతరులు కూడా పోటీ పడ్డారు. ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలోనే వచ్చారు. గతంలో మద్యం వ్యాపారం సాగించిన వారితో పాటు కొత్త వ్యక్తులు ఆసక్తిగా పాల్గొన్నారు. లాటరీ దక్కిన వారిలో చాలా మంది పాత వ్యాపారులే ఉండగా, కొత్తవారు 30 శాతం మంది ఉన్నారు. చాలా దుకాణాలను సిండికేట్‌గానే ఏర్పడి దక్కించుకున్నట్లు ప్రచారం సాగుతోంది. కొందరు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో దరఖాస్తులు చేయించారు. ఇతర జిల్లాల నుంచీ రప్పించారు.

ఓ వ్యక్తి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖలోని కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లుతో రూ.3.36 కోట్లతో 168 దుకాణాలకు దరఖాస్తు చేయిస్తే...11 దుకాణాలు దక్కాయి.

మద్యం వ్యాపారంలో అనుభవమున్న మురళీనగర్‌కు చెందిన ఓ కుటుంబం ఇంటిల్లిపాది వచ్చి లాటరీలో పాల్గొన్నారు. వీరి కుటుంబానికి రెండు దుకాణాలు దక్కాయి.

ఆయా దుకాణాలకు ఎన్ని చొప్పున దరఖాస్తులు వచ్చాయంటే

దరఖాస్తులు	దుకాణాలు
20	2
21	6
22	16
23	18
24	11
25	13
26	23
27	12
28	10
29	9
30	8
31	7
32	6
33	2
34	2
35	5
36	2
37	2
41	1

జీవీఎంసీ పరిధి దుకాణాలు	136
ఆనందపురం	8
పద్మనాభం	7
భీమిలి గ్రామీణం	4

» కొందరు 'లక్కీ నంబర్లు' ప్రకారం దరఖాస్తు చేశారు. విశాఖకు చెందిన ఓ వ్యక్తి తనకు 9వ నంబరు కలిసొస్తుందని 9 దరఖాస్తులు చేశారు. అయితే ఆయనకు ఎటువంటి దుకాణం రాలేదు. మరో వ్యక్తి ఆరు నంబరు కలిసొస్తుందని ఆరు దరఖాస్తులు వేసినా అదృష్టం కలిసిరాలేదు. మొదటిసారి సరదాగా చేసిన కొందరిని మాత్రం అదృష్టం వరించింది.

» దిల్లీ, నొయిడా నుంచి దరఖాస్తు చేసినవారున్నారు. వీరిలో కొందరు వందకుపైగా దరఖాస్తులు చేయగా పది వరకు వచ్చినట్లు సమాచారం. ఒడిశాకు చెందిన కొందరికి దుకాణాలు వచ్చాయి. తెలంగాణ నుంచి కొందరు పాల్గొన్నారు.

▸▸ **మేము సైతం:** మద్యం దుకాణాల లాటరీ కేటాయింపుల్లో కొందరి మహిళలను అదృష్టం వరించింది. 155 దుకాణాల్లో 31 మహిళలకు వచ్చాయి. కొందరికి రెండు, మూడేసి దక్కాయి. వీరిలో కొందరు వ్యాపారులు, గృహిణులు ఉన్నారు. ఆయా కుటుంబ సభ్యుల్లో బంధువుల పేరుతో కొత్తగా చేసిన వారికి కొన్ని దక్కాయి.

సిండికేట్ అలా

గతంలో మద్యం వ్యాపారం సాగించిన కొందరు ఎలాగైనా దుకాణాలను దక్కించుకోవాలనే ఉద్దేశంతో వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు, వారి వద్ద పనిచేసే వ్యక్తులతో దరఖాస్తు చేయించారు. ఇలా ఓ వ్యక్తి వంద వరకు దరఖాస్తు చేయిస్తే 20 వరకు దుకాణాలు దక్కినట్లు సమాచారం. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి పది వరకు దక్కాయి. కొందరు దరఖాస్తులు వేసినా ఆశించిన స్థాయిలో రాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు.

తక్కువ 20..గరిష్ఠంగా 41

జిల్లాలోని ఆయా దుకాణాలకు వచ్చిన దరఖాస్తులు సగటున 25 వరకున్నాయి. అత్యధికంగా 82వ దుకాణానికి 41 రాగా, అత్యల్పంగా 20 వచ్చినవి రెండు దుకాణాలున్నాయి. 26 దరఖాస్తులు వచ్చినవి 23 వరకు ఉన్నాయి. 23 చొప్పున 18 దుకాణాలకు వచ్చాయి.





కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సమక్షంలో లాటరీ తీస్తున్న జేసీ మయూర్ అశోక్.. వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్‌శాఖ డీసీ డి.శ్రీరామచంద్రమూర్తి

శబరిమలకు ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: శబరిమల వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ 3 ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకొచ్చిందని జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. 5, 6, 7 రోజుల పాటు ఈ యాత్రలు ఉంటాయన్నారు. 2023 మాదిరిగా ఈ ఏడాది విశాఖ నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నామన్నారు. సూపర్‌లగ్జరీ, అల్ట్రాడీలక్స్, ఇంద్ర బస్సుల సేవలు అందుబాటులో ఉన్నాయని, పూర్తి వివరాలకు 73829 14219 ఫోన్ నెంబరులో సంప్రదించాలని సూచించారు.

16న జడ్పీ స్థాయీ కమిటీ సమావేశాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ (జడ్పీ) స్థాయీ కమిటీ సమావేశాలు ఈనెల 16న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ, నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర అధ్యక్షతన 1 నుంచి 7 వరకు కమిటీల సమావేశాలు జరుగుతాయన్నారు. సభ్యులు, అధికారులు ఉదయం 10గంటల కల్లా హాజరుకావాలని కోరారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: డీఎస్సీకి హాజరవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ డి.డి. రామారావు తెలిపారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే ఈ అవకాశమన్నారు. టెట్‌లో అర్హత కలిగి ఉండాలని సూచించారు.

కాఫీ ధరలు పెంచుతూ అపెక్స్ కమిటీ నిర్ణయం



సమావేశంలో పాల్గొన్న జీసీసీ ఎండీ కల్పనాకుమారి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : అంతర్జాతీయంగా కాఫీ ధరల్లో వచ్చిన మార్పులను దృష్టిలో పెట్టుకొని కొన్ని రకాల కాఫీ ధరలను పెంచుతూ బీచ్‌రోడ్డులోని గిరిజన సహకార సంస్థ (జి.సి.సి) ప్రధాన కార్యాలయంలో జరిగిన అపెక్స్ కమిటీ సోమవారం నిర్ణయం తీసుకుంది. ట్రైబుల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అరబికా పార్చ్‌మెంట్ కేజీ రూ.285, అరబికా చెర్రీ రకానికి చెందిన కాఫీ కేజీ రూ.150, రొబస్టా రకానికి చెందిన కాఫీ కేజీ రూ.80గా ధరలు నిర్ణయించామన్నారు. ఈ మేరకు రైతులకు చెల్లిస్తామన్నారు. గతంతో పోల్చితే పార్చ్‌మెంట్, చెర్రీల కాఫీ ధరలు కేజీపై రూ.5, రొబస్టాపై రూ.10 పెరిగాయని జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి తెలిపారు. గత ఏడాది 565 మెట్రిక్ టన్నుల కాఫీని గిరిజన రైతుల నుంచి సేకరించగా ఈ సంవత్సరం 2000 మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సమావేశంలో పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ అభిషేక్, కాఫీ బోర్డ్ ఆఫ్ ఇండియా బెంగళూరు డైరెక్టర్ డి.ఆర్.బాబు రెడ్డి, అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ ఎస్.భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

ఖజానా శాఖ ఇన్‌ఛార్జి డీడీగా గోవిందరావు



వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఖజానా శాఖ జిల్లా ఇన్‌ఛార్జి ఉప సంచాలకులు (డీడీ)గా **పి.గోవిందరావు** సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ డీడీగా పనిచేసిన వై.సుధాకర్‌రావు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. దీంతో సీతమ్మధార ఉప ఖజానా ఏటీవో (సహాయ ఖజానా అధికారి)గా పనిచేస్తున్న గోవిందరావును ఇన్‌ఛార్జి డీడీగా నియమిస్తూ ఖజానా శాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. సెలవులో వెళ్లిన అధికారి తిరిగి వచ్చే వరకు గోవిందరావు ఇన్‌ఛార్జిగా కొనసాగనున్నారు.

ఆహ్లాదం లేదు...ఆదాయం రాదు!!

వైకాపా పాలనలో కుదేలైన పర్యాటక రంగం

వెంటాడుతున్న నాటి నిర్లక్ష్యం



అప్పూఘర్‌లోని యాత్రి నివాస్

ఈనాడు, విశాఖపట్నం

గత వైకాపా ప్రభుత్వం పర్యాటక రంగాన్ని నిర్లక్ష్యం చేసిందనేందుకు విశాఖలో ఎన్నో ప్రాజెక్టులు తార్కాణంగా ఉన్నాయి. గడువులోగా పనులు పూర్తి కాకపోవడంతో ఆ ప్రభావం ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఆదాయంపై పడింది. సమన్వయలోపం, చిన్నపాటి సమస్యలనూ విస్మరించడంతో పనులు నత్తనడకన సాగాయి. మిగిలిన శాఖలతో సమన్వయం కూడా కనిపించలేదు. దీంతో అన్ని గదులతో హోటళ్లను నిర్వహించలేని దుస్థితి ఇప్పుడు ఎదురైంది. ఈ పర్యాటక సీజన్‌కైనా అందుబాటులోకి తేలేకపోయారు. ఫలితంగా ఉద్యోగుల జీతాలకు సైతం ఇబ్బంది పడే స్థితి వచ్చింది.

» అప్పూఘర్‌లోని 'హరితా యాత్రి నివాస్' భవనాన్ని గడువు(ఆగస్టు 31)లోగా పునరుద్ధరించలేకపోయారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పనులు నెమ్మదిగా సాగాయి. వేగవంతంగా టెండరు ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభించుంటే ఇప్పటికే అందుబాటులోకి వచ్చేది.


ఇప్పటికీ చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వాస్తవానికి రూ.8.5 కోట్లకు పరిపాలన అనుమతి ఇచ్చారు. ఆ తర్వాత రూ.13.5 కోట్లకు అంచనాలు పెంచేశారు. ఇలా నచ్చినట్లు చేయడమే పనులకు గ్రహణంగా మారింది.

» అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 'జంగిల్‌బెల్స్ టైడా రిసార్ట్స్'ను రూ.8 కోట్లతో ఆధునికీకరించాలనుకున్నారు. కొత్తగా గదులు నిర్మించాలని ప్రతిపాదించారు. అందుకు అటవీశాఖ అనుమతులు తీసుకోవాలి. దీనికి గత ప్రభుత్వంలోనే అటవీశాఖ అడ్డు చెప్పింది. వాటిపై సంబంధిత శాఖతో చర్చించి సమస్యను పరిష్కరించుంటే పనులు ఇప్పటికే పూర్తయ్యేవి.

» అరకులోని వ్యాలీ రిసార్ట్స్, మయూరి హోటల్ నవీకరణ పనులు యుద్ధప్రాతిపదికన చేయించడంలో గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

హోటళ్ల నవీకరణకు కేటాయించిన నిధులు (రూ. కోట్లలో)

యాత్రినివాస్	13.5
అనంతగిరి	10
అరకు వ్యాలీ రిసార్ట్స్	5
మయూరి	8
టైడా	8



ఆదాయం పోయే

విశాఖ డివిజన్‌లో శ్రీకాకుళం, విశాఖ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఏపీటీడీసీకి ఏడు రిసార్టులు, అయిదు బార్, రెస్టారెంట్లు ఉన్నాయి. ఇవన్నీ హరితా పేరుతోనే నిర్వహిస్తున్నారు. వీటి ద్వారా భారీగానే ఆదాయం వచ్చేది. పర్యాటకులు ఎక్కువగా వచ్చే సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు, డిసెంబరు, జనవరి నెలలు చాలా కీలకం. వీటి ద్వారా ఏటా దాదాపు రూ.21 కోట్ల వరకు ఆదాయం వచ్చేది. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో పనులు పూర్తి కాక మొత్తం పర్యాటక హోటళ్ల నిర్వహణ కష్టంగా మారింది. ఆదాయం పడిపోయింది.

రెవెన్యూశాఖకు అధిక అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, అధికారులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు తరలి వచ్చారు. భూ సమస్యలు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషను కార్డులు వంటి వాటితో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ 120 మంది వినతులు అందజేశారు. అత్యధికంగా రెవెన్యూ శాఖకు 48 వచ్చాయి. జీవీఎంసీకి 29, పోలీసు శాఖకు 9, ఇతర శాఖలకు 34 చొప్పున వచ్చాయి. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలన్నారు. ఫిర్యాదిదారులు సంతృప్తి చెందేలా అవసరమైతే క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలన్నారు. డిప్యూటీ కలెక్టర్ ఎం.సీతారామమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పల్లె పండగ వారోత్సవాలు ప్రారంభం



గొల్లల తాళ్లవలసలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, చిత్రంలో కూటమి నాయకులు, అధికారులు

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా చేపట్టిన పల్లె పండగ వారోత్సవాలను మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రాజుల తాళ్లవలస పంచాయతీ గొల్లల తాళ్లవలసలో సోమవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులు రూ.30లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. వైకాపా పాలనలో నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలకు పూర్వ వైభవం తేవడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. భీమిలి మండలంలోని 16 పంచాయతీల్లో ఉపాధి పథకం నిధులు రూ.76 లక్షలతో మూడు తారు (బీటీ) రోడ్లు, రూ.5.88 కోట్లతో 21 సీసీ రోడ్లు మొత్తంగా రూ.6.64 కోట్లతో 24 పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్తు అభివృద్ధి అధికారి ఎన్.హనుమంతురావు, ఉపాధి పథకం అసిస్టెంటు ప్రాజెక్టు డైరెక్టరు ఆంజనేయులు, జడ్పీటీసీ సభ్యులు గాడు వెంకటప్పడు, ఎంపీటీసీ సభ్యులు కోరాడ రమణ తదితరులు పాల్గొన్నారు.



అందుబాటులో 'పీఎం సూర్యఘర్'

ఈనాడు, విశాఖపట్నం

కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్తు వినియోగాన్ని ప్రోత్సహించేందుకు 'ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ' పథకాన్ని ప్రవేశపెట్టింది. విద్యుత్తు ఛార్జీల భారంతో పాటు శిలాజ ఇంధన వినియోగం తగ్గించడమే ఈ పథకం ఉద్దేశం. ఇళ్ల పైకప్పు (రూఫ్ టాప్)లపై సౌర పలకలు ఏర్పాటు చేసుకుని ఆ ఇంటి అవసరాలకు తగ్గట్టు అక్కడే విద్యుత్తు ఉత్పత్తి చేసుకోవచ్చు. గతంలో వ్యక్తిగత గృహాలకు విద్యుత్తు రాయితీలు ఇచ్చేవారు. ఇప్పుడు బహుళ అంతస్తులకు (అపార్ట్‌మెంట్లు) కూడా రాయితీతో సోలార్ పరికరాలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది.

★ ఒక ఇంటికి గరిష్ఠంగా మూడు కిలోవాట్ల వరకే రాయితీ ఇస్తారు. మిగతా సొమ్ము బ్యాంకు నుంచి రుణంగా ఇప్పిస్తారు. వాటిని వాయిదాల రూపంలో చెల్లించుకోవచ్చు. ఒక కిలోవాట్‌కు సోలార్ పలకల ఏర్పాటు కోసం ఇంటి పైకప్పులో 100 చ.అ. ఖాళీ స్థలం ఉండాలి.

బహుళ అంతస్తులకు ఉపయోగం

ఇలా: అపార్ట్‌మెంట్లలో లిఫ్ట్, కారిడార్‌లో లైటింగ్, నీటి మోటార్లు వినియోగానికి కలిపి కామన్ మీటర్లు ఉంటాయి. ఇళ్లల్లో కంటే కామన్‌గా వాడే విద్యుత్తే ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి విద్యుత్తు అవసరాలకు సౌర పలకలు ఏర్పాటు చేసుకుంటే చాలావరకు ఖర్చు ఆదా అవుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు అపార్ట్‌మెంట్ సంక్షేమ సంఘాలకు అవగాహన కల్పిస్తున్నారు.




సోలార్ విద్యుత్తుపై అపార్ట్‌మెంట్‌వాసులకు అవగాహన కల్పిస్తున్న ఈపీడీసీఎల్ అధికారులు

వ్యక్తిగత గృహాలకు సోలార్ పలకల ఏర్పాటుకు రాయితీలు ఇలా

సామర్థ్యం	నెలకు ఉత్పత్తి (యూనిట్లలో)	ప్రాజెక్టు విలువ (రూ.ల్లో)	రాయితీ (రూ.ల్లో)
1 కిలోవాట్	120	60,000	30,000
2 కిలోవాట్	240	1,20,000	60,000
3 కిలోవాట్	360	1,80,000	78,000

ఉమ్మడి జిల్లాలో ఇటీవల మంజూరైన సోలార్ కనెక్షన్లు
★ విశాఖ : 547
★ అనకాపల్లి: 148

★ బహుళ అంతస్తుల్లో ఒక్కో ఫ్లాట్‌కు 3 కిలోవాట్ల చొప్పున ఎన్ని ఫ్లాట్లు ఉంటే అంత సామర్థ్యంతో సౌర పలకలు ఏర్పాటు చేసుకోవచ్చు. గరిష్ఠంగా 500 కె.వి.కి రాయితీ ఇస్తారు. వ్యక్తిగత గృహాలు మాదిరిగా కాకుండా కిలోవాట్‌కు రూ.18 వేల చొప్పున ఇస్తారు. మిగతా సొమ్ము బ్యాంకుల నుంచి రుణం తీసుకోవచ్చు.



విస్తృతంగా ప్రచారం: విద్యుత్తు ఛార్జీల భారం తగ్గించుకోవడానికి రూఫ్‌టాప్ సోలార్ మంచి మార్గం. అపార్ట్‌మెంట్లకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం. సహాయ సంచాలకుల పరిధిలో నెలకు 10 సోలార్ కనెక్షన్లు ఏర్పాటు చేసేలా లక్ష్యాలను విధించాం. నెట్ మీటర్ ఏర్పాటు ద్వారా..వినియోగదారులు వాడుకోగా మిగిలిన విద్యుత్తును నిర్ణీత ధరకు తీసుకుంటాం. వీటికి మూడు నెలలకోసారి సొమ్ములిస్తారు. –శ్యామ్‌బాబు, ఎస్ఈ, ఈపీడీసీఎల్, విశాఖపట్నం

విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధం

ఏపీఈపీడీసీఎల్‌లో కంట్రోల్ రూం నెంబర్లు

గురుద్వారా, న్యూస్‌టుడే: భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులు తలెత్తినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ అధికారులను ఆదేశించారు. ఈపీడీసీఎల్ పరిధిలోని 11 జిల్లాల అధికారులను అప్రమత్తం చేశారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని, అవసరమైతే యంత్రాంగం పరికరాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఎస్ఈ, ఈఈలకు సూచించారు. ప్రజలు తమ ఇబ్బందుల సమాచారాన్ని కార్పొరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూం నెంబర్లు, 1912కు ఫోన్ చేసి చెప్పాలని విజ్ఞప్తిచేశారు.

కంట్రోల్ రూం నెంబర్లు

విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయం 83310 18762 ★ విశాఖపట్నం 73822 49881 ★ అనకాపల్లి 94906 10022.

సిరులతల్లి తొలేళ్లు.. ఇంటింటా సంబరాలు

★ భక్తిశ్రద్ధలతో సాగిన ఘటాల పూజలు ★ నేటి మధ్యాహ్నం సిరిమానోత్సవం



ప్రత్యేక అలంకరణలో చదురుగుడి పైడితల్లి

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు.. పూసపాటి వంశీయుల ఆడబిడ్డ.. పైడిమాంబ తొలేళ్ల సంబరం సోమవారం కనుల పండువగా సాగింది. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం 8 గంటల సమయంలో ఆలయ అనువంశిక ధర్మకర్త, గజపతుల వారసుడు పూసపాటి అశోక్ గజపతిరాజు తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శనానికి వచ్చారు. వేదపండితులు తాతా రాజేష్ నాగేంద్రశర్మ, దూసి శివప్రసాద్, దూసి కృష్ణమూర్తి మంత్రోచ్ఛారణల నడుమ మాన్సాస్ కార్యనిర్వహణాధికారి కేఎన్‌డీవీ. ప్రసాద్, దేవస్థానం ఈవో డీవీవీ.ప్రసాదరావు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భగుడిలో తమ ఆడపడుచుకు పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వనంగుడికి వెళ్లి పట్టువస్త్రాలు సమర్పించి, పూజలు చేశారు. ప్రజలపై అమ్మవారి చల్లని దీవెనలు ఉండాలని అశోక్ ఆకాంక్షించారు. మంగళవారం మధ్యాహ్నం సిరిమానోత్సవం కనుల పండువగా సాగనుంది. అధికారులు ఇందుకు తగిన ఏర్పాట్లు చేశారు.

'విశాఖ డెయిరీ భూ అక్రమాలపై విచారణ జరపాలి'

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ సంస్థ చినగదిలి మండల పరిధి సర్వే సంఖ్య 13, 21, 26ల్లో భూ అక్రమాలకు పాల్పడిందని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్‌ను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఇదే విషయమై జీవీఎంసీ కమిషనర్, పోలీసు కమిషనర్‌కు సైతం ఫిర్యాదులు అందజేసినట్లు మూర్తియాదవ్ మీడియాకు తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన 20 ఎకరాల్లో...దాదాపు 12.05 ఎకరాలను హెల్త్‌సిటీ కోసం గతంలో కేటాయించారని, మిగిలిన 7.95 ఎకరాల్లో డెయిరీ సంస్థ వివిధ నిర్మాణాలు చేపట్టిందన్నారు. ఈభూమి విలువ రూ.500కోట్ల వరకు ఉంటుందని, దాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు.

నేడు కేంద్ర మంత్రి రాక

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి జయంత్ చౌధరి మంగళవారం విశాఖ రానున్నారు. ఉదయం 8.20గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. తర్వాత 9.30 గంటలకు మెడ్‌టెక్ జోన్‌కు వెళ్లి అక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 6.35 గంటల విమానంలో కేంద్ర మంత్రి తిరుగు ప్రయాణం కానున్నారు.

'జర్నలిజం హెచ్‌ఓడీ' డాక్టర్ వినయ్‌కుమార్ తొలగింపు

విచారణకు ఆదేశం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్రవిశ్వవిద్యాలయం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ వినయ్‌కుమార్‌పై వేటు పడింది. ఈ మేరకు సోమవారం రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు ఉత్తర్వులు జారీచేశారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావుకు హెచ్‌ఓడీగా ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. వినయ్‌కుమార్‌పై వస్తున్న ఆరోపణలపై విచారణ చేసి నివేదిక ఇచ్చేందుకు ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.సీతామాణిక్యం ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల బృందాన్ని నియమించారు. ★ ఏయూ జర్నలిజం విభాగాధిపతిగా ఉన్న డాక్టర్ వినయ్‌కుమార్ మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీ నుంచి ఏయూకు బదిలీపై రావడం, కృష్ణా యూనివర్సిటీలో ఒకరికి పీహెచ్‌డీ మంజూరు, ఉద్యోగినులపై వేధింపులు...వంటి అంశాలపై ఆరోపణలు ఉన్నాయి. గవర్నర్, వర్సిటీ కులపతి జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదులందాయి. వారి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు వీసీ ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఈనాడు, న్యూస్‌టుడే, గాజువాక

ఆ అలవాటే ఆరోగ్య 'కరము'!

అరచేతుల్లో కంటికి కనిపించని క్రిములెన్నో ఉంటాయి. ఆ చేతులతో ఆహారం తింటే... ఆరోగ్యానికి హానికరమే. అందుకే.. క్రమం తప్పకుండా చేతుల్ని శుభ్రం చేసుకోవాలి.



నేడు చేతుల శుభ్రత దినోత్సవం

మానవ శరీరంలోకి సూక్ష్మక్రిములు ప్రవేశించడానికి అనేక మార్గాలు ఉన్నాయి. ఎక్కువగా జనం గుమిగూడి ఉండే ప్రదేశాల్లో పర్యటించినప్పుడు నోరు, ముక్కు ద్వారా క్రిములు లోపలకు వెళ్తాయి. ఎదుటి వ్యక్తులు తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు లేదా గట్టిగా మాట్లాడినప్పుడు బ్యాక్టీరియాలతో కూడిన శ్వాసకోశ బిందువులు వాయుమార్గంలో మనిషి శరీరంలోకి చేరుతాయి. చేతుల శుభ్రత ద్వారా క్రిములు శరీరంలోకి వెళ్లకుండా కొంత మేర నియంత్రించొచ్చు.

బాధ్యత మరవద్దు..!

ఇంట్లో పిల్లల ఆరోగ్యంలో శుభ్రత అనేది ప్రధానపాత్ర పోషిస్తుంది. వాళ్లకు చేతులు శుభ్రం చేసుకునే విధానాలు నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. ప్రాథమిక దశ నుంచే క్రిములు, వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలి. ఆరోగ్యమే మహాభాగ్యమని బాధ్యతగా వివరించి చెప్పాలి.

ఎప్పుడు కడుక్కోవాలి..?

ఏమైనా ఆహార పదార్థాలు తినే ముందు, ఆ తర్వాత చేతులు కడుక్కోవాలి. మరుగుదొడ్లోకి వెళ్లొచ్చినప్పుడు కచ్చితంగా సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.



ఇవీ దశలు..

1 : చేతుల్ని కుళాయి నీటితో పూర్తిగా తడపాలి.
2 : తడి చేతులకు తగినంత సబ్బు రాసుకోవాలి.
3 : చేతుల వెనుక భాగంలో, వేళ్ల మధ్యలో, గోళ్ల కింద, ఉపరితలంలో గట్టిగా రుద్దాలి.
4 : శుభ్రమైన వస్త్రం, టవల్‌తో తుడుచుకోవాలి.

ఎంతసేపు..

★ కనీసం 20 నుంచి 30 సెకన్ల పాటు చేతుల్ని కడగాలి. ★ ఇష్టమైన పాట ఏదైనా నోటితో గట్టిగా పాడుతూ... చేతుల్ని కడుక్కోవడం ఓ అలవాటుగా చేసుకుంటే మంచి ప్రయోజనం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

వ్యక్తిగత జాగ్రత్తలు తప్పనిసరి



ఎవరికి వారే వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకుంటే 100 శాతం వ్యాధులకు దూరంగా ఉండొచ్చు. పిల్లల్లో సంక్రమించే సీజనల్ వ్యాధులకు మూల కారణం చేతుల్లోనే ఉంది. అప్పటి వరకు ఆడుకున్న పిల్లలు... చేతులు కడుక్కోకుండా ఆహారం తీసుకోవడంతో అనేక అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. జలుబు, దగ్గు, ఫ్లూ.. తదితరాలకు అపరిశుభ్రతే ప్రధాన కారణం. చేతుల శుభ్రతపై శ్రద్ధ వహిస్తే... కొన్ని రోగాలు దరి చేరవు. – డాక్టర్ టి.తిరుపతిరావు, పిల్లల వైద్య నిపుణులు, గాజువాక

శుభ్రతపై పాఠ్యాంశాలు



ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో వ్యక్తిగత శుభ్రత అంశాన్ని చిన్నప్పటి నుంచే నేర్పించేలా పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. దేశంలో 70 శాతం పిల్లలకు చేతుల శుభ్రతగా సరైన అవగాహన లేదని అనేక సర్వేలు చెబుతున్నాయి. విద్యా బోధనతో పాటు రోజూ పాఠశాలల్లో చేతులు శుభ్రతపై కనీసం 5 నిమిషాలు వివరించాలి. ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం కంటే ముందుగా ఆరోగ్య జాగ్రత్తలు తెలియజేయడంతో పిల్లల్లో మార్పు వస్తుంది.

– అలజంగి ఉదయకుమార్, వ్యక్తిత్వ వికాస నిపుణులు

మూడు సిండికేట్ల మాయాజాలం

ఎక్కువ దుకాణాలు వారికే...

మాధవధార, న్యూస్‌టుడే: విశాఖ జిల్లాకు సంబంధించి సోమవారం ఉదయం వీఎంఆర్‌డీఏ బాలల ప్రాంగణంలో నిర్వహించిన మద్యం దుకాణాల లాటరీ పారదర్శకంగా సాగింది. జిల్లాలో 155 దుకాణాలకు గాను, 4139 దరఖాస్తులు వచ్చాయి. ఉదయం 8 గంటల నుంచే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో గెజిట్ ప్రకారం ఒక్కో దుకాణానికి లాటరీ వేసే ప్రక్రియ ప్రారంభించగా, దరఖాస్తుదారులు ఉదయం 6 గంటలకే ప్రాంగణానికి చేరుకున్నారు. మధ్యాహ్నం 1 గంటకల్లా ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేశారు. గెజిట్ ప్రకారం ఒక్కో దుకాణానికి ఎంత మంది దరఖాస్తులు చేశారో, ఆ నంబర్ల ఆధారంగా ఒక డబ్బాలో వేసి వాటిలో వచ్చిన నంబర్ వారికి మద్యం దుకాణాన్ని కేటాయించారు.

తొలి వ్యక్తులే అన్నీ దక్కించుకుని..

ఒక్కో షాపునకు లాటరీలో ముగ్గుర్ని ఎంపిక చేశారు. లాటరీ దక్కించుకున్న వ్యక్తి ఆరో వంతు ఫీజు చెల్లించి, బ్యాంకు గ్యారెంటీ ఇవ్వాల్సి ఉంది. ఒకవేళ ఆ ముగ్గురిలో మొదటి వ్యక్తి వచ్చి చెల్లింపు చేస్తే ఎటువంటి అభ్యంతరం ఉండదు. అతను చెల్లించని పక్షంలో రిజర్వులో ఉంచిన రెండు, మూడో వ్యక్తులకు అవకాశం కల్పించేలా ఏర్పాట్లు చేశారు. అయితే లాటరీలో ఎంపిక చేసిన ముగ్గురిలో మొదటి వ్యక్తులే అన్ని దుకాణాలకు ఆరో వంతు ఫీజులు చెల్లించి దక్కించుకున్నారు.

అన్ని పార్టీల వారూ ఉన్నారు

మద్యం దుకాణాల లాటరీ బయటకు మామూలుగా కనిపించినప్పటికీ, నగరానికి చెందిన మూడు సిండికేట్ల మధ్య పోటాపోటీగా జరిగింది. ఒక్కో సిండికేటు నుంచి 200 నుంచి 500 దరఖాస్తులు వారి బంధువులు, అనుచరులతో వేయించారు. లాటరీలో మూడు సిండికేట్లకు చెందిన వ్యక్తులే ఎక్కువ దుకాణాలను దక్కించుకున్నారు. వీరితో పాటుగా కొందరు రాజకీయ నాయకులు నేరుగా షాపుల వేలంలో పాల్గొన్నారు. మరికొందరు వారి బంధువుల, అనుచరులతో వేయించి బయట ఉండి అంతా నడిపించారు. మద్యం దుకాణాల టెండర్లలో అన్ని రాజకీయ పార్టీ నాయకుల భాగస్వామ్యం పెద్ద ఎత్తున కనబడింది.



లాటరీలో పాల్గొన్న దరఖాస్తుదారుల టోకెన్ నెంబర్లను పరిశీలిస్తున్న పోలీసులు

దుకాణాలకు భారీ డిమాండ్

ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలైనా పొందవచ్చు. లైసెన్సు పొందిన వ్యక్తి నగర పరిధిలో ఎక్కడైనా దుకాణాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. దీంతో ఇప్పుడు లైసెన్సు పొందిన వారికి దుకాణాల ఏర్పాటుకు భారీ డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం జిల్లాలో 138 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇవన్నీ అద్దె ప్రాంగణాల్లో నడుస్తున్నవే. ఇందులో ఎక్కువగా వ్యాపారం జరిగే ప్రాంతాల్లో ఉన్న మద్యం దుకాణాలకు మద్యం వ్యాపారులు మూడు నెలలు ముందుగానే అడ్వాన్స్ ఇచ్చి నిలుపుకొన్నారు. ఇప్పటికే నడుస్తూ, మందుబాబులకు అలవాటైన ఈ దుకాణాలన్నింటినీ కొంత మంది తమ ఆధీనంలో పెట్టుకున్నారు. ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేయబోయే 155 దుకాణాల లైసెన్సులు పొందిన వారు తమ దుకాణాల్ని ఎక్కడ ఏర్పాటు చేసుకోవాలనేది లావాదేవీల ద్వారా తేల్చుకోవాల్సిందే.

పెరగనున్న ఐటీ నియామకాలు: గంటా



శ్రీటెక్ సాఫ్ట్‌వేర్ సంస్థను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

కొమ్మాది, న్యూస్‌టుడే: ఐటీ కంపెనీల్లో నియామకాల ప్రక్రియ వృద్ధి చెందుతోందని, మరిన్ని సంస్థలు విశాఖ తరలివచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వ కృషి చేస్తోందని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మారికవలసలో కొత్తగా ఏర్పాటు చేసిన శ్రీటెక్ సాఫ్ట్‌వేర్ సంస్థను సోమవారం ఆయన ఎంపీ శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ ఐటీకి సంబంధించి ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, రానున్న అయిదేళ్లలో వీటిని రెట్టింపు చేసేందుకు ఉమ్మడి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ విశాఖ ఐటీ హబ్‌గా మారనుందని, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ కృషితో టీసీఎస్ సంస్థ ద్వారా 10వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు రానున్నాయన్నారు. శ్రీటెక్ సీఈవో తోట హరి మాట్లాడుతూ తమ సంస్థ 400మందికి పైగా ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించనుందన్నారు. మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, జనసేన భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త పంచకర్ల సందీప్, 5వవార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, సంస్థ డైరెక్టర్ కృష్ణప్రసాద్, ఆపరేషన్ మేనేజర్ వెంకట్, మేనేజర్లు ఈశ్వర్, ప్రవీణ్, జనసేన 5వ వార్డు అధ్యక్షుడు దేవర శివ పాల్గొన్నారు.

విశాఖ వేదికగా న్యూరాలజీ వైద్యుల జాతీయ సదస్సు



సదస్సు బ్రోచర్‌ను విడుదల చేస్తున్న డాక్టర్ బుచ్చిరాజు, డాక్టర్ గోపి, తదితరులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: న్యూరాలజీ వైద్య రంగంలో వస్తున్న ఆధునిక పోకడలు, వ్యాధుల నిర్ధారణ, చికిత్సా విధానాలపై ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు విశాఖలో జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఆంధ్ర వైద్య కళాశాల(ఏఎంసీ) న్యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో 31వ ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ నేషనల్ కాన్ఫరెన్సును విశాఖ వేదికగా నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, సదస్సు కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎస్.గోపి, ఇతర ప్రతినిధులు డాక్టర్ సతీష్, డాక్టర్ సుష్మ వెల్లడించారు. సోమవారం కళాశాల ఆవరణలో జరిగిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ బుచ్చిరాజు మాట్లాడుతూ 21 ఏళ్ల తర్వాత జాతీయ సదస్సును నిర్వహించే అవకాశం ఏఎంసీకి లభించిందని, పలు రాష్ట్రాలతో పోటీ పడి సదస్సు నిర్వహణ బాధ్యతలను దక్కించుకున్నట్లు చెప్పారు. ఐఏఎన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ దేబాసిష్ చౌధురి సహా పలువురు జాతీయ కార్యవర్గ సభ్యులు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో పేరొందిన ఆరుగురు వైద్య నిపుణులకు జీవితకాల సాఫల్య పురస్కారాలు, 8 మంది న్యూరాలజిస్టులకు ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ ఫెలోషిప్‌లను అందజేస్తామని డాక్టర్ బుచ్చిరాజు వివరించారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ ప్రారంభం



బ్యాంక్ శాఖను ప్రారంభిస్తున్న నేవల్ డాక్‌యార్డు ఏఎస్‌డీ శ్రీనివాస్

సింధియా, న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతం సింధియాలో సోమవారం బ్యాంక్ ఆఫ్ బరోడా తన శాఖను ప్రారంభించింది. ఈ శాఖను ఈస్టర్న్ నేవల్ కమాండ్‌కు చెందిన నేవల్ డాక్‌యార్డు అడ్మిరల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌సీఎస్ రీజనల్ మేనేజర్ రఘురామన్ చక్రవర్తి, బీవోబీ రీజనల్ మేనేజర్ పి.ఎం.పఠాన్, డీఆర్ఎం సతీషా సాలుంకే, బీఎం సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

గుండె జబ్బులపై అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న హోంమంత్రి అనిత

ఆరిలోవ, న్యూస్‌టుడే : ఆరిలోవ హెల్త్‌సిటీలో ఉన్న అపోలో ఆసుపత్రిలో సోమవారం చెస్ట్ పెయిన్ క్లినిక్‌ను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్న వయసులోనే గుండె జబ్బులబారిన పడుతున్నారని.. దీనిపై ప్రాథమిక అవగాహన కలిగించాలన్నారు. అపోలో వైద్య బృందం దీనికి సహకరించాలన్నారు. ఆసుపత్రుల్లో మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అపోలో రీజనల్ సీఈవో వై.సుబ్రహ్మణ్యం, సీఓఓ రామచంద్ర, డాక్టర్ డి.కె బారువా, డాక్టర్ శశాంక, డాక్టర్ చక్రధర్, డాక్టర్ రవికాంత్, తదితర వైద్య బృందం సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో 'విశ్వం' చిత్ర బృందం



ఆలయ ప్రాంగణంలో హీరో గోపీచంద్, దర్శకుడు శ్రీను వైట్ల తదితరులు

సింహాచలం, న్యూస్‌టుడే: ఇటీవల విడుదలైన విశ్వం చిత్ర బృందం సోమవారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకుంది. చిత్ర కథానాయకుడు గోపీచంద్, దర్శకుడు శ్రీను వైట్ల, నటులు పృధ్వీరాజ్, బెనర్జీ, షకలక శంకర్, ఇతర సాంకేతిక నిపుణులు సింహగిరికి విచ్చేశారు. వారికి అధికారులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ప్రభుత్వ ఐటీఐల డీఎల్‌టీసీఎస్ అధ్యక్షునిగా ఈశ్వరరావు



ప్రమాణ స్వీకారం చేస్తున్న కొత్తగా ఎన్నికైన ప్రతినిధులు

కంచరపాలెం, న్యూస్‌టుడే: జిల్లా ప్రభుత్వ ఐటీఐల డీఎల్‌టీసీఎస్ (డిస్ట్రిక్ లెవెల్ ట్రైనింగ్ సెంటరు స్టాఫ్ అసోసియేషన్) నూతన కార్యవర్గాన్ని సోమవారం ప్రభుత్వ పాత ఐటీఐలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా బి.ఈశ్వరరావు, ఉపాధ్యక్షులుగా డి.వెంకటేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా జి.వి.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా ఆర్.సతీష్‌కుమార్, సిహెచ్.లలితకుమారి, కోశాధికారిగా వి.శ్రీనివాసరావు, సభ్యులుగా కె.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, జె.సత్యనారాయణ, ఎస్.వి.వి.ఎన్.వరప్రసాద్‌లు ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులతో ఎన్నికల అధికారులు కె.ఎస్. శ్రీనివాసరావు, ఎం.రవికుమార్‌లు ప్రమాణ స్వీకారం చేయించారు. ఎన్నికల పరిశీలకునిగా ఎ.పి.ఎన్.జి.ఓ.ఎస్.ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.అప్పలరాజు వ్యవహరించారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	125	120
లైవ్	147	140
డ్రెస్డ్	213	250
స్కిన్‌లెస్	243	260

28న విశాఖ ఉక్కులో సమ్మె

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 28న విశాఖ ఉక్కులో సమ్మె నిర్వహించనున్నట్లు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు వీరు సమ్మె నోటీసును ఉక్కు సీజీయం (హెచ్ఆర్) జి.గాంధీకి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, ఇంటక్, సిటూ ఇతర కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - విశ్వం

ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం తహసీల్దారుగా బి.చిన్నికృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి చేస్తున్నామన్నారు. జిరాయితీ రైతులు కార్యాలయం చుట్టూ తిరగకుండా దరఖాస్తు చేసుకున్న తర్వాత పరిశీలించి ఆర్వోఆర్ చట్టం ప్రకారం వారి ఖాతాల్లో నమోదు చేయడం జరుగుతుందన్నారు.

పెందుర్తి

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంటలోని జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జెడ్సీ హేమవతి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సమస్యలు పరిష్కారానికి తగుచర్యలు తీసుకుంటామని అర్జీదారులకు హామీ ఇచ్చారు. 98వ వార్డు అడవివరంలో రహదారి సమస్యను పరిష్కరించాలని, 94వ వార్డు బీసీకాలనీలో కొండమీదకు మంచి నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, ఆది కాలనీలో ఎవరికి నచ్చినట్టు వారు రహదారులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారని, 96వ వార్డు దొగ్గవానిపాలెంలో అక్రమ నిర్మాణం పనులను నిలుపుదల చేయాలని అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్వో నారాయణరావు, వర్క్సు విభాగం డీఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారుల సమస్యలను వింటున్న జెడ్సీ హేమవతి

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM

పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

న్యూస్‌టుడే, పెందుర్తి

సమస్య: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ కూడలి ... 224/65/2 స్తంభానికి ఉన్న వీధి దీపం గత రెండు నెలలుగా వెలగడం లేదు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో రాత్రివేళ పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – ఎం.కనకరావు, చినముషిడివాడ

సమాధానం: మీ ప్రాంతంలో వెలగని వీధి దీపానికి త్వరలోనే మరమ్మతు చేయించి వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – శివరామ్ ప్రసాద్, ఏఈ, 97వ వార్డు

కలుషితం.. కలవరం..

ఫార్మా వ్యర్థ జలాలతో కాలుష్య కాసారంగా పరవాడ

పరవాడ, న్యూస్‌టుడే

మండల కేంద్రం పరవాడలోని చెరువులు, గెడ్డలు ఫార్మా కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. రాంకీ ఫార్మాసిటీలోని రసాయన వ్యర్థ జలాలు కలవడంతో నీరు నల్లగా మారి దుర్వాసన రావడంతో పాదచారులు, వాహనచోదకులు ముక్కు మూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాల సమయంలో రాంకీ ఫార్మాసిటీకి చెందిన రసాయన వ్యర్థ జలాలను పలు సంస్థలు దొడ్డిదారిన బయటకి విడిచి పెట్టడంతో గెడ్డల ద్వారా చెరువుల్లో చేరి విషతుల్యంగా మారుతున్నాయి. నిబంధనల ప్రకారం ఫార్మాసిటీలోని వర్షపు నీటిని తప్ప మిగతా ఎటువంటి జలాలను బయటకి విడిచిపెట్టరాదు. ఫార్మా సంస్థల నుంచి వెలువడే వ్యర్థ జలాలను రాంకీ సంస్థ అప్పగించాలి. రాంకీ వాటిని శుద్ధిచేసి తిప్పవానిపాలెం సముద్ర తీరంలోకి విడిచిపెడుతుంది. శుద్ధి చేసేందుకు గాను ఫార్మా సంస్థలు నిర్వహణ ఖర్చులు రూపంలో రాంకీకి కొంత మొత్తాన్ని చెల్లించాలి. అయితే నిబంధనలు ఉల్లంఘించి జోరువాన కురిసిన సమయంలో యథేచ్ఛగా బయటకి విడిచిపెట్టడంతో చెరువులు, గెడ్డ వాగుల్లోని జలాలు నల్లగా మారుతున్నాయి. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పంటలు పండించడం మానేశారు..

రసాయన వ్యర్థ జలాల కారణంగా పరవాడ పెద్దచెరువు, మోల్లోడు గెడ్డవాగు, సన్యాసిచెరువు, పెద్దచెరువు విషతుల్యమయ్యాయి. ఈ నీటితో పొలాల్లో వ్యవసాయం చేయలేకపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. పొలాల్లో పనిచేస్తే చర్మ వ్యాధులు, దురదలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూలీలు కూడా పనులకు రావడం లేదు. దీంతో పరవాడ ఊరచెరువు రైతులు ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి నాట్లు వేయడం మానేశారు. భూములు బీడుగా మారాయి. ఫార్మా సిటీ కారణంగా ఈ ప్రాంతంలో కాలుష్యం పెచ్చుమీరడంతో పాటు భూగర్భజలాలు కలుషితమవుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వాడపాలెం పెద్ద చెరువులోని చేపలు పెద్ద ఎత్తున మృత్యువాత పడ్డాయి. వర్షాలు, మేఘావృతం అయిన సమయంలో రసాయన విష వాయువులను గాల్లోకి విడిచిపెట్టడంతో భరించలేని దుర్వాసన వస్తోందని తమగోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నల్లగా మారిన మోల్లోడు గెడ్డలోని నీరు



రైతులు పంటలు వేయకపోవడంతో బీడుగా మారిన ఊర చెరువు ఆయకట్టు

పీసీబీ తీరుపై అసహనం..

పరవాడ ప్రాంతం కాలుష్య కాసారంగా మారుతున్నా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు చేసిన సమయంలో పీసీబీ ప్రతినిధులు నీటి నమూనాలు సేకరించి తీసుకుని వెళ్తున్నారే తప్ప అనంతరం వాటి ఫలితాలను బహిర్గతం చేయడం లేదని వాపోతున్నారు. 3 నెలల క్రితం భరణికం మోల్లోడు గెడ్డవాగులోకి పెద్దఎత్తున రసాయన జలాలు చేరడంతో పీసీబీ అధికారులు చేరుకుని వాటిలో రసాయనాల శాతం ఉందని నిర్ధారించారు. ఆ సమయంలో తూతూమంత్రంగా పలు ట్యాంకర్లతో ఈ నీటిని తోడించి రాంకీకి తరలించి చేతులు దులుపుకొన్నారు. పరిశ్రమలకు నోటీసులు ఇచ్చామని, ఇటువంటి ఘటనలు పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని అప్పట్లో ప్రకటించారు. మరలా కొద్దినెలలకే చెరువులు, గెడ్డ వాగులు విషతుల్యంగా మారడంతో పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత, పీసీబీ అధికారులు స్పందించి కాలుష్యం నుంచి పరవాడ ప్రాంతాన్ని కాపాడాలని కోరుతున్నారు.


పంచాయతీ వార్డు సభ్యులకు శిక్షణ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలోని ప్రతి పంచాయతీ నుంచి ఇద్దరు వార్డు సభ్యులకు ఈనెల 15, 16 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.పద్మజ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులు శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమానికి ఎంపిక చేసిన వార్డు సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె సూచించారు.

ఇరువర్గాల ఘర్షణ.. ఇద్దరు యువకుల అరెస్టు

పెందుర్తి, న్యూస్‌టుడే: రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో పెందుర్తి పోలీసులు సోమవారం ఇద్దరు యువకులను అరెస్టు చేశారు. దీనికి సంబంధించి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాయుడుతోట దరి అప్పలనర్సయ్య కాలనీకి చెందిన జి.కల్యాణ్ చక్రవర్తి(20) ఈ నెల 12న సాయంత్రం అతడి స్నేహితులు ప్రసన్నకుమార్, ప్రభాకర్‌తో కలిసి అప్పలనర్సయ్య కాలనీలోని వినాయక ఆలయం దగ్గరకు వెళ్లాడు. అప్పటికే అక్కడ జి.వినోద్ (21), కిరణ్(19) మద్యం తాగుతున్నారు. కల్యాణ్ చక్రవర్తి స్నేహితుడు ప్రభాకర్ తనకు బీరు కొనుగోలు చేయమని వినోద్‌ను అడిగాడు. దానికి వినోద్ నిరాకరించాడు. ఆ క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఇంతలో పోలీసులు రావడంతో వారంతా పారిపోయారు. అనంతరం కొంతసేపటి తర్వాత మరోసారి అక్కడికి చేరుకుని బీరు కోసం గొడవపడ్డారు. ఆ క్రమంలో వినోద్, కిరణ్ కత్తి, కర్రలతో కల్యాణ్ చక్రవర్తి, అతడి స్నేహితులపై దాడి చేసి చంపడానికి ప్రయత్నించారు. వారికి గాయాలు కావడంతో పారిపోయి పోలీసులకు సమాచారం అందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితులు వినోద్, కిరణ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఇరువర్గాల మధ్య పాత గొడవలు ఉన్నట్లు సీఐ సతీశ్‌కుమార్ తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడు గల్లంతు



యర్ర సన్యాసిరావు (పాతచిత్రం)

వి.జుత్తాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడు గల్లంతైన ఘటన పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రెడ్డి అసిరితాత, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి మండలం వి.జుత్తాడ పంచాయతీ పరిధిలోని దువ్వపాలెం గ్రామానికి చెందిన యర్ర సన్యాసిరావు(65) సోమవారం సాయంత్రం బహిర్భూమి కోసం స్థానిక చెరువు వద్దకు వెళ్లాడు. తిరిగి వచ్చే సమయంలో ప్రమాదవశాత్తు చెరువులో జారిపడిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ అసిరితాత సంఘటన ప్రాంతానికి చేరుకుని వృద్ధుడి ఆచూకీ కోసం ఇద్దరు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు ప్రారంభించారు. అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. రాత్రి 9 గంటలు దాటినా వృద్ధుడి ఆచూకీ లభించలేదు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది.

అ వీ ఇ వీ

అయ్యప్ప ఆలయంలో మండల దీక్షలు ప్రారంభం

సుజాతనగర్(పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్‌లోని పూర్ణ పుష్కల సమేత ధర్మశాస్తా అయ్యప్ప స్వామి దేవాలయంలో మండల దీక్షలు ప్రారంభమైనట్లు ఆలయ ధర్మకర్త, గురుస్వామి వాకా చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు సోమవారం ఆలయ ప్రాంగణంలో దీక్షలు స్వీకరించారు. గురుస్వామి చంద్రశేఖర్ చేతుల మీదుగా మాలధారణ చేశారు. అనంతరం భక్తులు అయ్యప్ప స్వామిని శరణుఘోషలు, భజనలతో కొలిచారు. విశేష హారతులిచ్చి ఆరాధించారు.

16 నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాలు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం ప్రోహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఈనెల 16 నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభమవుతాయని ప్రోహిబిషన్, ఎక్సైజ్ సీఐ డి.అనిల్‌కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 14న సబ్బవరం మండలానికి సబంధించి 8, పరవాడలో 11 మద్యం దుకాణాలకు డ్రా తీయడం జరిగిందన్నారు. సబ్బవరం మండలానికి కేటాయించిన 8 దుకాణాలు స్థానికులకే వచ్చాయన్నారు. చెల్లించాల్సిన మొత్తంలో ఆరో వంతు నగదు చెల్లించిన వారికి తాత్కాలిక లైసెన్సులు జారీ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వానికి ఇవ్వాల్సిన అన్ని పత్రాలు ఇచ్చాక పూర్తిస్థాయిలో లైసెన్సులు ఇస్తామన్నారు.

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: పెందుర్తి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 36 మద్యం దుకాణాలకు సోమవారం వేలం పాటలు జరిగాయి. మొత్తం 924 మంది దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ సరోజిని తెలిపారు. నగరంలో కలెక్టర్ పర్యవేక్షణలో లాటరీ తీసి దుకాణాలు కేటాయించామన్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం కేటాయించిన తొలి వాయిదాను వెంటనే చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ చెరువులను రసాయన వ్యర్థ జలాలతో కాలుష్యమయం చేస్తున్న రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం అనకాపల్లి డీఆర్వో దయానిధిని కలిసి ఫిర్యాదు చేశారు. ఫార్మా రసాయన వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా బయటకి విడిచి పెట్టడం వల్ల చెరువులు, గెడ్డవాగులు, భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరారు.

పల్లెల్లో అభివృద్ధి పరుగులు

ఘనంగా ప్రారంభమైన శంకుస్థాపనలు

పెందుర్తి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని 54 గ్రామ పంచాయతీలను రాబోయే అయిదేళ్లలోపు సంపూర్ణంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. 'పల్లె పండగ - పంచాయతీ వారోత్సవాలు' కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన అభివృద్ధి పనుల శంకుస్థాపనకు పెందుర్తి మండలం ముదపాక పంచాయతీలో ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల క్రితం గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి పనులకు ఒకేసారి తీర్మానాలు చేయడం జరిగిందన్నారు. నిధులు మంజూరైన నేపథ్యంలో వారం రోజుల పాటు జరిగే పల్లె పండగలో భూమిపూజ చేసి పనులను ప్రారంభిస్తున్నామన్నారు. సీసీ రహదారులు, డ్రైన్లు, కల్వర్టులు, శ్మశానాల్లో షెడ్లు, ప్రహరీల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఆయా పనులన్నీ నెల రోజుల్లోనే పూర్తి చేసి పండగ వాతావరణంలో ప్రారంభోత్సవాలు కూడా చేస్తామన్నారు. ముందుగా పనులు పూర్తి చేసిన పంచాయతీలకు మరిన్ని నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. తొలిరోజు ముదపాక, గుర్రమ్మపాలెం, వాలిమెరక, ఎస్ఆర్‌పురం, గవరపాలెం, గొరపల్లి, పినగాడి, రాంపురం పంచాయతీల్లో శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మదుపాడ నాగమణి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో కొల్లి వెంకటరావు, ఈవోపీఆర్డీ గుండు అప్పలరాజు, పీఆర్ డీఈఈ రమణమూర్తి, ఏఈ లక్ష్మణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యనారాయణ, ఏపీవో గోవింద్, ఏపీఎం ఎస్తేర్‌రాణి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలో ఈనెల 15న పల్లె పండగ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. 15న బంగారమ్మపాలెం, ఆరిపాక, గొట్టివాడ, టెక్కలిపాలెం, వంగలి, అంతకాపల్లి, గాలిభీమవరం, నారపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు శంకుస్థాపనలు చేస్తారని ఎంపీడీవో పేర్కొన్నారు.



ఎస్‌ఆర్‌పురంలో శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, ఎంపీపీ నాగమణి, తదితరులు

సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించొద్దు



బాధితులతో మాట్లాడుతున్న సి.పి. శంఖబ్రత బాగ్చీ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : పోలీసు సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు విశేష స్పందన లభించింది. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. తక్షణమే సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించటంలో అలసత్వం వహించవద్దని ఆదేశించారు. సోమవారం పోలీసు సమావేశమందిరంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 58 మంది బాధితులు హాజరై తమ వినతులు సమర్పించారు.

అధ్యయన యాత్ర పేరుతో విహారం



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటరు గంగారావు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ జీవీఎంసీ కార్పొరేటర్లు చేపడుతున్న అధ్యయన యాత్రను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జీవీఎంసీలో సీపీఎం ఫ్లోరులీడరు బి.గంగారావు, పార్టీ నాయకులు ఆర్కేఎస్‌వీ కుమార్, వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈనెల 20 నుంచి 27 వరకు యాత్ర నిర్వహించాలని జీవీఎంసీ నిర్ణయించిందన్నారు. ఈ పర్యటనలో అధ్యయనం కోసం కేవలం 3గంటలు మాత్రమే కేటాయించారని, మిగిలిన సమయమంతా విహార యాత్రలకే కేటాయించడం దారుణమన్నారు. ఈ యాత్రను తమ కార్పొరేటరు గంగారామ్ బహిష్కరిస్తున్నారని చెప్పారు. యాత్రను రద్దు చేసి ఈ ఖర్చును ప్రజావసరాల కోసం వినియోగించాలన్నారు. సీఎం, ఉప ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకుని ప్రజాధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

అమ్మవారి సన్నిధిలో అన్నసమారాధన

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లో కొలువైన పంచముఖ గాయత్రీ అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత ముఖ్య అతిథిగా పాల్గొని అన్న సంతర్పణ ప్రారంభించారు. వేలాది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రమణమూర్తి, శంకర్‌ప్రసాద్, చెన్నాజీ, అప్పలరాజు, మహేశ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శానాపతి వసంత, కమిటీ సభ్యులు

క్షీణించిన పారిశుద్ధ్యం



పేరుకుపోయిన వ్యర్థాలు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం గొర్లెవానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో పారిశుద్ధ్యం క్షీణిస్తోంది. ఇక్కడ సుమారు 1839 కుటుంబాలు నివసిస్తున్నాయి. కాలనీలోని రహదారుల వెంబడి ఎక్కడికక్కడ చెప్పకుప్పలు పేరుకుపోయి అపరిశుభ్రత తాండవిస్తోంది. కాలువల్లో పూడిక, చెత్త పేరుకుపోయి మురుగు స్తంభించి దోమలు, ఈగలకు ఆవాసంగా మారుతున్నాయి. గత కొద్దిరోజుల నుంచి వ్యర్థాలను తరలించకపోవడంతో అపరిశుభ్రత నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారుల వెంబడి పిచ్చిమొక్కలు పెరిగి పాములు సంచరిస్తున్నాయని భయాందోళన చెందుతున్నారు. చెత్త నుంచి దుర్వాసన రావడంతో పాటు దోమల బెడదతో కంటినిండా కరవైందని వాపోతున్నారు. చెత్తను శునకాలతో పాటు పశువులు చిందర వందర చేస్తున్నాయని చెబుతున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 10న మండల స్థాయి అధికారులు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని కాలనీలో తూతూమంత్రంగా చేపట్టారని దీనివల్ల ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కాలనీలో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని కాలనీవాసులు కోరుతున్నారు.



రహదారి పక్కన చెత్త

ప్రజాధనానికి.. నిర్లక్ష్యపు పొదలు

పెందుర్తి, న్యూస్‌టుడే: ప్రజారోగ్య పరిరక్షణలో పాలుపంచుకోవాలన్న లక్ష్యంతో జీవీఎంసీ రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన బహిరంగ వ్యాయామ పరికరాలకు నిర్లక్ష్యపు పొదలు అల్లుకున్నాయి. ప్రజాధనంతో ఏర్పాటు చేసిన ఇనుప పరికరాలు లక్ష్యం నెరవేరకుండానే తుప్పుపట్టిపోయే దుస్థితి నెలకొంది. జీవీఎంసీ 96వ వార్డు పరిధిలోని పెందుర్తి గోకాడ చెరువు గట్టుపై ఏర్పాటు చేసిన బహిరంగ వ్యాయామ పరికరాలు యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.



పిచ్చిమొక్కలతో మూసుకుపోయిన బహిరంగ వ్యాయామశాలకు వెళ్లే మార్గం

తుప్పుపట్టిపోతున్న వ్యాయామ పరికరాలు..

గోకాడ చెరువు వైపు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు పేర్కొన్నారు. చెరువు చుట్టూ పెద్ద ఎత్తున పిచ్చిమొక్కలు, తుప్పలు, తుమ్మ చెట్లు పెరిగిపోయి పాములు, విష పురుగులు సంచరిస్తున్నాయి. చెరువు గట్టుపై నిర్మించిన నడకదారి పూర్తిగా మూసుకుపోయింది. ధైర్యం చేసి ముందుకు వెళ్లాలన్నా దారి కనిపించని పరిస్థితి. పరికరాలు వినియోగంలోకి లేకపోవడంతో తుప్పుపట్టి రూ.లక్షల ప్రజాధనం వృథాగా పోతోంది. చెరువు గట్టుపై తుప్పలు తొలగించి వ్యాయామ పరికరాలను వినియోగించుకునేలా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. గతంలో మహిళలు సైతం ఇక్కడ వ్యాయామం చేసుకునేవారని గుర్తు చేశారు. ఉదయపు నడకకు వెళ్లేవారు సైతం చెరువు గట్టును వినియోగించుకునే వారని పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్వహణ లోపంతో విలువైన సామగ్రి నిరుపయోగంగా మారిందని వాపోయారు. తక్షణమే సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.




తుప్పల నడుమ వ్యాయామ పరికరాలు

రైతుబజార్లకు నాణ్యమైన టమాటా

జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్‌శాఖ ఇన్‌ఛార్జి అధికారి రాకేష్

ఈనాడు కథనానికి స్పందన

కంచరపాలెం, న్యూస్‌టుడే: రైతుబజార్లకు నాణ్యమైన టమాటాలను మాత్రమే వినియోగదారులకు విక్రయించాలని జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్‌శాఖ ఇన్‌ఛార్జి అధికారి రాకేష్ తెలిపారు. 'రైతుబజార్లకు కుళ్లిన టమాటా' శీర్షికతో సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. సోమవారం కంచరపాలెం రైతుబజారుకు వచ్చి టమాటాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12, 13 తేదీల్లో విశాఖలో రైతుబజార్లకు వచ్చిన టమాటా లోడులో అనంతపురం జిల్లాలో వర్షాలు పడడం వలన కొంత వరకు పాడయ్యాయన్నారు. దెబ్బతిన్న టమాటాను గ్రేడింగ్ చేసి రైతుబజార్లలో నాణ్యమైనవే వినియోగదారులకు విక్రయించాలని సంబంధిత ఎస్టేటు అధికారుల ద్వారా డ్వాక్రా గ్రూపులకు తెలియజేశామన్నారు



టమాటాను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ ఇన్‌ఛార్జి అధికారి రాకేష్ తదితరులు

రతన్‌టాటా మృతికి నివాళి



రతన్‌టాటా చిత్రాన్ని గీసి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

సుజాతనగర్(పెందుర్తి), న్యూస్‌టుడే: ప్రముఖ పారిశ్రామిక వేత్త, సమాజ సేవకుడు రతన్‌టాటా మృతికి సుజాతనగర్ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల విద్యార్థులు సోమవారం ఘనంగా నివాళి అర్పించారు. ప్రధానోపాధ్యాయిని రమాదేవి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మైదానంలో రతన్‌టాటా భారీ చిత్రాన్ని గీశారు. ఆయన సామాజిక సేవలను గుర్తు చేసుకుంటూ వందనం చేసి నివాళి అర్పించారు.

ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్

సబ్బవరం, న్యూస్‌టుడే: ఏపీ ఒప్పంద అధ్యాపకుల అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు సబ్బవరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకులు సోమవారం పసుపు రిబ్బన్లు కట్టుకుని విధులకు హాజరయ్యారు. ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబరు 114 ప్రకారం గత ప్రభుత్వం ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరణ చేస్తామని చెప్పి కాలయాపన చేసిందని ఆరోపించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన పత్రాలను ఆవిష్కరించారు.



డిమాండ్లతో కూడిన పత్రాలను ఆవిష్కరిస్తున్న ఒప్పంద అధ్యాపకులు

ఆక్రమిత అసైన్డ్ భూములను అప్పగించాలని వినతి



తహసీల్దారు బి.చిన్నికృష్ణకు దరఖాస్తు అందిస్తున్న బాధితులు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం బంగారమ్మపాలెంలో ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్డ్ భూములను కొందరు ఆక్రమించుకున్నారని, వాటిని తిరిగి ఇప్పించాలని బాధితులు సోమవారం సబ్బవరం తహసీల్దారు బి.చిన్నికృష్ణకు వినతిపత్రం అందజేశారు. 1984లో అప్పటి ప్రభుత్వం సర్వేనెంబర్లు 70/6లో 2 ఎకరాలు, 70/22లో 5 సెంట్ల స్థలానికి గ్రామానికి చెందిన వంకర అమ్మతల్లికి అసైన్డ్ పట్టా ఇచ్చారు. అప్పటినుంచి ఈ భూమిని సాగు చేసుకుని ఫలసాయాన్ని అనుభవిస్తూ ఉన్నామని అమ్మతల్లి కుటుంబ సభ్యులు వంకర అర్జున తెలిపారు. ఈ భూమిని అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని వంశపారపర్యంగా వస్తున్న భూమిని తమకు అప్పగించాలని కోరారు.

ప్రమాదకరంగా ఫ్యూజ్‌బాక్స్



దర్పణం

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెంలో రహదారిని ఆనుకుని ఉన్న ఫ్యూజ్ బాక్స్ ప్రమాదకరంగా మారింది. ఇక్కడి స్తంభానికి ఉన్న ఫ్యూజ్ బాక్స్ పిల్లల చేతికి అందేంత ఎత్తులో ఉండటంతో పాటు ఎటువంటి మూత లేకపోవడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వర్షాల సమయంలో బాక్స్ నుంచి పొగలు వస్తున్నాయని, గతంలో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఫ్యూజ్‌బాక్స్ వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

భీమిలి

సి ని మా లు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్‌ – జనక అయితే గనక
రాములమ్మ– దేవర
తాతా – వేట్టయాన్‌ ది హంటర్‌
సప్తగిరి– విశ్వం, చోటుమహరాజ్‌
(వెల్లంకి) – వేట్టయన్‌ ది హంటర్‌

నేడు అనంతవరం, పెంట గ్రామాల్లో ‘పల్లె పండగ’

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం మండలంలో మంగళవారం నిర్వహించే పల్లె పండగ కార్యక్రమానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరు కానున్నట్లు మండల తెదేపా అధ్యక్షుడు కోరాడ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతవరం, పెంట గ్రామాల్లో ఉదయం పది గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరు కానున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని పల్లె పండగ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రమణ కోరారు.

ఎండాడ, న్యూస్‌టుడే

సమస్య: అన్నంరాజ్‌నగర్‌(మధురవాడ)లో పదుల సంఖ్యలో వీధి దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నాం. –స్థానికులు, మధురవాడ
సమాధానం: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. –శ్రీనివాస్‌, ఏఈ

సమస్య: పొట్నూరు గ్రామం(పద్మనాభం)లో పలు వీధుల్లో లీకుల కారణంగా తాగునీరు వృథాగా పోతోంది. –ఎర్నిబాబు, పద్మనాభం
సమాధానం: మంచినీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటాం. –ముస్తాక్‌, సచివాలయ అధికారి

మేమున్నాం.. మీకు తోడుగా
80086 11711, 99122 22247
సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సమస్య: గొల్లల ఎండాడలో కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన, దోమల బెడద అధికంగా ఉంది. –స్థానికులు, గొల్లల ఎండాడ
సమాధానం: కాలువల శుభ్రతకు చర్యలు తీసుకుంటాం. –రాగిణి, సచివాలయ అధికారి.

భీమిలిలో కొత్త వాణిజ్య సముదాయం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలో గతంలో కూల్చివేసిన దుకాణ సముదాయం స్థానంలో కొత్తగా ఆధునిక వాణిజ్య సముదాయం త్వరలోనే అందుబాటులోకి రాబోతోంది. ఇందుకోసం జీవీఎంసీ రూ.1.50 కోట్లతో విశాలమైన 11 దుకాణాలను వేగంగా నిర్మిస్తోంది. భీమిలిలో 40 ఏళ్ల క్రితం పురపాలక సంఘం నిర్మించిన దుకాణాల నిర్వహణ సరిగా లేకపోవడంతో అవి శిథిలావస్థకు చేరాయి. ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం పొంచి ఉండడంతో మూడేళ్ల క్రితం లీజుదారులను ఖాళీ చేయించి కూల్చివేశారు. దీంతో జీవీఎంసీకి ప్రతీనెలా అద్దెల ద్వారా వచ్చే రూ.రెండు లక్షల కోల్పోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆరునెలల క్రితం జీవీఎంసీ రూ.1.50 కోట్లు మంజూరు చేసి అదే స్థలంలో ఆధునిక హంగులతో కొత్త వాణిజ్య సముదాయం నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది.

ఎమ్మెల్యే గంటా చొరవతో..

ఈ వాణిజ్య సముదాయాన్ని మల్టీ ఫ్లెక్స్‌ తరహాలో నిర్మించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేసిన సూచనతో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఇందులో మార్పులు చేశారు. తొలుత కేవలం గ్రౌండ్‌ ఫ్లోరులో దుకాణాలు నిర్మించి పైకప్పునకు స్లాబ్‌ కాకుండా రేకులు వేయాలని చేసిన ప్రతిపాదనను ఎమ్మెల్యే వ్యతిరేకించారు. దీంతో పాత ప్రతిపాదనల్లో మార్పులు చేసి దుకాణాలకు స్లాబ్‌లు వేయాలని సంకల్పించారు. దీనివల్ల రానున్న కాలంలో రెండు, మూడు అంతస్థుల్లో దుకాణాలు నిర్మించడం ద్వారా జీవీఎంసీ ఆదాయ వనరులను పెంచుకోటానికి అవకాశం ఉంటుందని భావించారు.

రూ.1.50 కోట్లతో చురుగ్గా నిర్మాణాలు



జీవీఎంసీ నిర్మిస్తున్న దుకాణ సముదాయం

భవిష్యత్తులో చేపట్టనున్న నిర్మాణాల ప్రతిపాదన

అంతస్తు	చేపట్టనున్న నిర్మాణాలు	ప్రతిపాదించిన మొత్తం
మొదటి అంతస్తు	11 దుకాణాలు	రూ.కోటి
రెండవ అంతస్తు	ఫంక్షన్‌ హాలు	రూ.80 లక్షలు

త్వరలో వ్యాపారులకు కేటాయింపు



భీమిలిలో ఇంజినీరింగ్‌ విభాగం చేపడుతున్న వాణిజ్య సముదాయం పూర్తయిన తర్వాత వేలం వేసి వ్యాపారులకు దుకాణాలు కేటాయిస్తాం. భీమిలి గంటస్తంభం రోడ్డును త్వరలో విస్తరించనున్న దృష్ట్యా వీటిని రహదారికి దూరంగా నిర్మిస్తున్నాం. వీటి వద్ద వాహనాల పార్కింగ్‌కు అనువుగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. వీటి వెనుక భాగంలో కూరగాయలు, చేపల మార్కెట్ల కోసం షెడ్లు నిర్మిస్తున్నాం. భవిష్యత్తులో ఇక్కడ మరిన్ని నిర్మాణాలు చేపడతాం. కొత్త వాణిజ్య సముదాయం అందుబాటులోకి వచ్చాక గతంలో జీవీఎంసీ కోల్పోయిన ఆదాయాన్ని మళ్లీ భర్తీ చేసుకోటానికి మార్గం సుగమం అవుతుంది.

–పి.ప్రేమప్రసన్నవాణి,
జోనల్‌ కమిషనర్‌, భీమునిపట్నం

రతన్‌ టాటాకు నివాళి

సాగర్‌నగర్‌, న్యూస్‌టుడే: ప్రముఖ పారిశ్రామికవేత్త, టాటా గ్రూప్‌ సంస్థల ఛైర్మన్‌ దివంగత రతన్‌ టాటాకు గీతం డీమ్డ్‌ వర్సిటీ సోమవారం నిర్వహించిన సంతాప సభలో ఘనంగా నివాళులర్పించింది. ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పనలో టాటా సంస్థల పాత్ర ఎంతో గర్వించదగినదని అన్నారు. గీతం వర్సిటీకి టాటా గ్రూప్‌ సంస్థలకు ముఖ్యంగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌కు అవినాభావ సంబంధం ఉందన్నారు. దేశ ప్రగతి కోసం అంకిత భావంతో పనిచేసిన ఆయన కృషి నేటి తరం యువతకు మార్గదర్శకం కావాలన్నారు. జీసీజీసీ సెంటర్‌ డైరెక్టర్‌ కె.వి.ఉమాదేవి, గీతం స్కూల్‌ ఆఫ్‌ బిజినెస్‌ డీన్‌ ఆచార్య రాజా ఫణి పప్పు, డైరెక్టర్లు కె.నాగేంద్ర ప్రసాద్‌, వంశీకిరణ్‌ సోమయాజుల, డిప్యూటీ డైరెక్టర్‌ డాక్టర్‌ బి.రవికిరణ్‌ తదితరులు పాల్గొన్నారు.



సంతాప సభలో పాల్గొన్న గీతం ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గౌతమ్‌రావు తదితరులు

కనులపండువగా అప్పన్న నిత్యకల్యాణం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి నిత్య కల్యాణోత్సవం సోమవారం సింహగిరిపై కనులపండువగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతా మూర్తుల పరిణయోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.

సేవలకు గుర్తింపు

కొమ్మాది, న్యూస్‌టుడే: బక్కన్నపాలెం ఏపీఎస్పీ 16వ బెటాలియన్‌ సహాయ కమాండెంట్‌ పి.దేవనందరావు పదోన్నతిపై కాకినాడ 3వ బెటాలియన్‌కు బదిలీ కావడం, యూనిట్‌ మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ బి.రాజశేఖరం సింహాచలం ఆసుపత్రికి బదిలీ అవ్వడంతో వారికి సోమవారం అభినందన సభ నిర్వహించారు. కమాండెంట్‌ కె.వి.మురళీకృష్ణ వారిని ఘనంగా సత్కరించి ఇప్పటి వరకు వారందించిన సేవలను కొనియాడారు. అనంతరం సిబ్బంది కవాతును, ఆయుధాల పనితీరు తదితర వాటిని పరిశీలించి సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమాండెంట్‌ సీహెచ్‌.వి.ఎస్‌.పద్మనాభరాజు, సహాయ కమాండెంట్లు పి.సత్యం, జి.ఇలియ సాగర్‌, వి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



సత్కారం అందుకున్న దేవనందరావు, రాజశేఖరంలతో బెటాలియన్‌ పోలీసు అధికారులు

ముగిసిన శిక్షణ

సాగర్‌నగర్‌, న్యూస్‌టుడే: రుషికొండ గాయత్రీ విద్యా పరిషత్‌ (జీవీపీ) డిగ్రీ అండ్‌ పీజీ కోర్సుల కళాశాల వేదికగా 13 ఆంధ్రా బెటాలియన్‌ ఎన్‌సీసీ క్యాంప్‌ కమాండింగ్‌ ఆఫీసర్‌ లెఫ్టినెంట్‌ కల్నల్‌ నీరజ్‌కుమార్‌ ఆధ్వర్యంలో పదిరోజుల పాటు జరిగిన ఉత్తరాంధ్ర జిల్లాల ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ శిక్షణ ద్వారా ఎన్‌సీసీ విద్యార్థులకు చేకూరే ప్రయోజనకర అంశాల్ని క్యాంప్‌ డిప్యూటీ కమాండెంట్‌ కెప్టెన్‌ ఆర్‌.బి.అనంతరావు వివరించారు. శిక్షణ పొందిన ఎన్‌సీసీ క్యాడెట్లకు ధ్రువపత్రాలు అందజేశారు. సుబేదార్‌ మేజర్‌ శ్రీనివాస్‌ తదితర అధికారులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన ఎన్‌సీసీ విద్యార్థులతో క్యాంప్‌ కమాండింగ్‌ ఆఫీసర్‌ నీరజ్‌కుమార్‌ తదితరులు

వైభవంగా ఏకాదశి తిరువీధి

సింహాచలం, న్యూస్‌టుడే: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం సింహాద్రి అప్పన్న స్వామి తిరువీధి ఉత్సవం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు మదన గోపాలస్వామి, అమ్మవార్లను పట్టు పీతాంబరాలు, పూలమాలలతో అలంకరించి పల్లకీలో అధిష్ఠింపజేశారు. నాదస్వర మంగళవాయిద్యాలు, పండితుల వేద పారాయణల నడుమ సింహగిరి మాడవీధుల్లో దేవవతామూర్తుల తిరువీధి వేడుకగా జరిగింది. భక్తులు స్వామిని దర్శించుకుని గోవింద నామస్మరణ చేశారు.





పూజలందుకున్న మదన గోపాలస్వామి, అమ్మవార్లు, సింహగిరి మాడవీధుల్లో ఊరేగింపు

బాలిక వైద్యానికి దాతల చేయూత

భీమునిపట్నం, న్యూస్‌టుడే: నిరుపేద కుటుంబానికి చెందిన మద్దిల రాణి(8) అనారోగ్యంతో మంచానపడడంతో దాతలు ముందుకొచ్చి వైద్య సహాయం కోసం రూ.24 వేలు అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. భీమిలి బోయివీధికి చెందిన మద్దిల శ్రీను, రమా ఇందిర దంపతులకు పుట్టిన రాణి అనారోగ్యంతో బాధ పడుతూ అస్వస్థతకు గురైంది. చికిత్స కోసం దాతలను అర్థించగా భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, నక్కా రవికుమార్‌ స్పందించి రూ.24వేలు సమకూర్చారు. ఆ సొమ్మును సోమవారం భీమిలిలో జరిగిన కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ద్వారా బాలిక రాణి, ఆమె తండ్రి శ్రీనులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు కె.నాగరాజు, ఎం.సంజీవ్‌కుమార్‌, కె.ఎల్లాజీ, ఆర్‌.రమణ పాల్గొన్నారు.

జాతర గట్టుపై అన్నసమారాధన

కొమ్మాది, న్యూస్‌టుడే: చంద్రంపాలెం జాతర గట్టు శ్రీదుర్గాలమ్మ ఆలయంలో దసరా ఉత్సవాల ముగింపులో భాగంగా సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు. దాతలు బండి దుర్గాకిషోర్‌కుమార్‌, గోకరకొండ శ్రీకాంత్‌, కె.రవికుమార్‌ దంపతుల ఆర్థిక సహాయంతో అన్నసమారాధన చేపట్టారు. ఎండాడకు చెందిన రేవతి డెవలపర్స్‌ అధినేత ఎల్‌డివి ప్రసాద్‌రాజు దంపతుల ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. దాతలను ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్‌, అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, ఉపాధ్యక్షుడు ఎస్‌.ఎన్‌.మూర్తి, కార్యదర్శి నాగోతి తాతారావు తదితరులు ఘనంగా సత్కరించారు.





సోమవారం కురిసిన వర్షానికి ఎండాడ-సాగర్‌నగర్‌ దారిలో నిలిచిపోయిన నీరు

▼ చినుకు పడితే వణుకు

ఎండాడ, న్యూస్‌టుడే: 8వ వార్డు పరిధి రాజీవ్‌నగర్‌(ఎండాడ) నుంచి సాగర్‌నగర్‌, జాతీయ రహదారికి వెళ్లే ప్రధాన మార్గం అపరిశుభ్రతకు, దుర్వాసనకు కేంద్రంగా మారుతోంది. వర్షం పడితే ఇక్కడ భారీగా వర్షపు నీరు నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర ఆటంకం ఎదురవుతోంది. నీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో ఒకసారి వర్షం పడితే దాదాపు పది రోజులు నీరు నిలిచిపోతోంది. అందులో వ్యర్థాలు కలిసిపోయి దుర్గంధంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆ నీళ్లలోనే రాకపోకలు జరపడం వల్ల ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. గత కొన్నేళ్లుగా ఇక్కడ ఈ సమస్య ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఏఈ సురేష్‌ వద్ద ఈ విషయం ప్రస్తావించగా ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు.

▼ నదీ జలాల్లో కోళ్ల వ్యర్థాలు

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం, మద్ది గ్రామాల్లోని కొంత మంది కోడి మాంసం విక్రేతలు, కోళ్ల ఫారం నిర్వాహకులు వాటి వ్యర్థాలను పద్మనాభం గోస్తనీ వంతెన వద్ద నదిలో పడేస్తున్నారు. దీనివల్ల నదీ జలాలు కలుషితమవుతున్నాయి. గోస్తనీ నీటిని మండలంలోని అనేక గ్రామాలతో పాటు, అటు భీమిలి, విశాఖ తదితర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా సంబంధిత అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



గోస్తనీ వంతెన గట్టుపై పడేశారిలా..

▼ ఈ భవనానికి మరమ్మతులెప్పుడు?

పద్మనాభం, న్యూస్‌టుడే: కృష్ణాపురం ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోని ఓ భవనం నిరుపయోగంగా ఉంది. వినియోగించకపోవడంతో కిటికీలు, తలుపులు చెదలు పట్టి శిథిలావస్థకు చేరాయి. స్లాబు పెచ్చులూడుతూ ప్రమాదకరంగా తయారైంది. ఈ భవనానికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని, ఈ బడికి రక్షణ గోడ సైతం నిర్మించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.



కృష్ణాపురం పాఠశాల ప్రాంగణంలో నిరుపయోగంగా ఉన్న బడి భవనం

● అర్జీదారుల నుంచి వినతుల స్వీకరణ

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్‌-2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో అర్జీదారుల నుంచి జెడ్సీ పి.సింహాచలం వినతిపత్రాలు స్వీకరించారు. రేవళ్లపాలెం రహదారి విస్తరణలో స్థలాలు కోల్పోయిన బాధితులకు టీడీఆర్‌లు అందించి రహదారిని అభివృద్ధి చేయాలని బాధితులు కోరారు. శివశక్తినగర్‌లో కొందరు రహదారిని ఆక్రమించి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఎం.తిమ్మాపురంలో వీధిదీపాలు వెలగడం లేదని, అయోధ్యనగర్‌లో పార్కును అభివృద్ధి చేయాలని ఆయా ప్రాంతీయులు కోరారు.

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి జోనల్‌ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్‌ఎస్‌)కు మూడు వినతులు వచ్చాయి. వాటిని పరిష్కరించే నిమిత్తం సంబంధిత విభాగాలకు బదలాయించినట్లు జెడ్సీ పి.ప్రేమప్రసన్నవాణి పేర్కొన్నారు.

● రైతుబజార్లకు నాణ్యమైన టమాటా

కంచరపాలెం, న్యూస్‌టుడే: రైతుబజార్లకు నాణ్యమైన టమాటాలను మాత్రమే వినియోగదారులకు విక్రయించాలని జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్‌శాఖ ఇన్‌ఛార్జి అధికారి రాకేష్‌ తెలిపారు. ‘రైతుబజార్లకు కుళ్లిన టమాటా’ శీర్షికతో సోమవారం ‘ఈనాడు’లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. సోమవారం కంచరపాలెం రైతుబజారుకు వచ్చి టమాటాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12, 13 తేదీల్లో విశాఖలో రైతుబజార్లకు వచ్చిన టమాటా లోడులో అనంతపురం జిల్లాలో వర్షాలు పడడం వలన కొంత వరకు పాడయ్యాయన్నారు. దెబ్బతిన్న టమాటాను గ్రేడింగ్‌ చేసి రైతుబజార్లలో నాణ్యమైనవే వినియోగదారులకు విక్రయించాలని సంబంధిత ఎస్టేటు అధికారుల ద్వారా డ్వాక్రా గ్రూపులకు తెలియజేశామన్నారు.

● అగ్నిప్రమాద బాధితునికి వితరణ

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి కృష్ణాకాలనీ వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో దుకాణం కాలిపోయి రోడ్డునపడ్డ బాధితుడు వియ్యపు తవుడుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ చేతుల మీదుగా రూ.10వేల ఆర్థిక సహాయాన్ని వితరణగా అందించారు. ఇటీవల జరిగిన ఈ ప్రమాదాన్ని భీమిలి మూడోవార్డు తెదేపా అధ్యక్షుడు గొలగాని నరేంద్రకుమార్‌ పరిశీలించి బాధితునికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు సోమవారం నగదు సాయం చేశారు. తెదేపా నాయకులు కనకల అప్పలనాయుడు, నక్కిళ్ల పెద్ద వేంకటేశ్వరరావు, ఆవాల సూరిబాబు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న రవితేజ

‘సీ-ఫేస్‌’ విన్యాసాలు

సింధియా, న్యూస్‌టుడే: సీ-ఫేస్‌ మలబార్‌-2024 విన్యాసాలు సోమవారం బంగాళాఖాతంలో జరిగాయని ఈఎన్‌సీ వర్గాలు తెలిపాయి. ఈ విన్యాసాల్లో భాగస్వామ్య దేశాలకు చెందిన వివిధ రకాల యుద్ధనౌకలు చురుగ్గా పాల్గొని అంతర్గత శక్తి సామర్థ్యాలను ప్రదర్శించినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి.



విన్యాసాల్లో పాల్గొన్న యుద్ధ నౌకలు

‘ఫ్రీహోల్డు ముసుగులో భూ అక్రమాలు’

వన్‌టౌన్‌, న్యూస్‌టుడే: ఆనందపురం మండలం గిడిజాల గ్రామంలో ఫ్రీహోల్డు ముసుగులో భూ అక్రమాలు జరిగాయని, ఓ ప్రజాప్రతినిధి, అధికారులు ఏకమై తమ భూములు లాక్కొన్నారని స్థానిక రైతు కర్రి అప్పలనాయుడు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. సర్వే సంఖ్య 178-12లో 18 సెంట్ల భూమి ఉందని, 1970 నుంచి ఆ భూమి తమ ఆధీనంలో ఉందగా, ఇటీవల జరిగిన ఫ్రీహోల్డు సమయంలో 18 సెంట్లను మరో ముగ్గురు రైతుల పేరుతో రాసి ఇచ్చారన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు.

★ ఆనందపురం మండలం సర్వే సంఖ్య 185-10లోని 45 సెంట్ల భూమిని ఫ్రీహోల్డు సమయంలో వేరొకరి పేరున మార్చేశారని స్థానికులు పిణగం గౌరమ్మ తెలిపారు. తమకు అన్యాయం చేశారని, అక్రమాలపై లోతైన విచారణ జరిపించాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.



కలెక్టరేట్‌ వద్ద నిరసన తెలుపుతున్న గిడిజాల గ్రామ రైతులు

‘శారదా పీఠం భూమిని స్వాధీనం చేసుకోవాలి’

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి మండలం కొత్తవలస కొండపై వైకాపా ప్రభుత్వ హయాంలో శారదా పీఠానికి అక్రమంగా కేటాయించిన భూమిని ప్రభుత్వం భేషరతుగా స్వాధీనం చేసుకుని ప్రజావసరాలకు వినియోగించాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్‌ పేర్కొన్నారు. భీమిలిలోని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విడిది కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. విశాఖ శారదా పీఠంలో జరుగుతున్న అక్రమాలపై కూడా దృష్టి కేంద్రీకరించాలన్నారు. విశాఖలో కొందరు వైకాపా నాయకులు ఆక్రమించిన భూ వ్యవహారాలకు సంబంధించి విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు బోడేపూడి దొరబాబు, డాక్టర్‌ పపూర్‌నికుంజ్‌, జి.పోలిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్య మార్గంలో సమస్యల తిష్ఠ
బీచ్‌రోడ్డులో పొంచి ఉన్న ప్రమాదాలు



బేపార్కు కొండ సమీప డివైడర్‌పై విద్యుత్తు స్తంభం ఇలా..

సాగర్‌నగర్‌, న్యూస్‌టుడే: జూపార్కు, సాగరతీర ద్వారం - రుషికొండ శివారు ఐటీసెజ్‌ కూడలి మధ్య బీచ్‌రోడ్డులో పలు చోట్ల ప్రమాదకర పరిణామాలతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. పర్యాటకంగా పేరు ప్రఖ్యాతులు సంతరించుకుని విశాఖ నగరానికే మణిహారంగా నిలిచే తీర ప్రాంత రహదారిలో ఇలాంటి పరిస్థితులు నెలకొనడం శోచనీయమని పలువురు వాపోతున్నారు. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే బీచ్‌రోడ్డు ప్రాధాన్యత దృష్ట్యా ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇవీ సమస్యలు : ★ బేపార్కు సమీప రోడ్డులోని సిమెంట్‌ విద్యుత్తు స్తంభాన్ని రాత్రి వేళ గుర్తుతెలియని ఓ భారీవాహనం ఢీకొనడంతో స్తంభం దిగువభాగం బాగా దెబ్బతిని ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

★ రుషికొండ శివారు ఐటీసెజ్‌ కూడలి రహదారిపై ఇసుక పేరుకుపోవడంతో ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాలు పడేటప్పుడు ఎగువ ప్రదేశాల నుంచి వాననీటితో పాటు వచ్చే ఇసుక ఇక్కడ ఇలా పేరుకుపోతోంది.

★ కార్తికవనానికి చేరువలో ప్రమాదాల నివారణలో భాగంగా వాహనాల వేగాన్ని నియంత్రించే దిశగా పోలీసులు గతంలో ఏర్పాటు చేసిన వేగ నిరోధకాలు కొంత మేర దెబ్బతినడంతో వాహనాలు మితిమీరిన వేగంతో నడుస్తున్నాయి. ఈ కారణంగా ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ★ గుడ్లవానిపాలెం అమ్మవార్ల ఆలయాల వద్ద రోడ్డుపై వాననీరు నిలిచిపోకుండా సమీప పల్లం ప్రదేశంలోని అటవీ భూముల్లో కలిసేలా కాలిబాటకు ఆనుకుని రహదారిపై నిర్మించిన కాల్వ ప్రమాదాలకు నిలయంగా ఉంది.

★ రుషికొండ నుంచి సాగర్‌నగర్‌లోకి ప్రవేశించే చోట వల్లభగణపతి ఆలయ కూడలి డివైడర్‌పై నాటిన మొక్కలు ఏపుగా పెరగడం వల్ల వాహనాల్ని గమనించక కాలనీ లోపలికి వెళ్లే క్రమంలో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ తరుణంలో కొత్తగా వేగ నిరోధకాల్ని ఏర్పాటు చేయడంతో పాటు ఏపుగా పెరిగిన కొమ్మల్ని తొలగిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని స్థానికులు అంటున్నారు.



ఐటీసెజ్‌ కూడలిలో పేరుకుపోయిన ఇసుక

★ జూపార్కు ద్వారం సమీపంలో ఎండిపోయిన ఓ చెట్టు ఎప్పుడు ఎవరిమీద పడుతుందో తెలియని పరిస్థితి. బీచ్‌రోడ్డు ప్రాధాన్యం దృష్ట్యా ఈ సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఈ ప్రాంతీయులు జీవీఎంసీ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



జూపార్కు ద్వారం చేరువలో ప్రమాదకరంగా ఎండిన చెట్టు

విశాఖ తూర్పు

అణగారిన ప్రజలకు తీరని లోటు

ఆరిలోవ, న్యూస్‌టుడే : ప్రొఫెసర్ సాయి బాబా మరణం అణగారిన వర్గాలకు తీరని లోటని భారత నాస్తిక సమాజం, ఆరిలోవ కేంద్రం ఒక ప్రకటనలో సంతాపం తెలిపింది. 90 శాతం అంగవైకల్యం ఉన్నప్పటికి అణగారిన ఆదివాసి ప్రజల హక్కులకై తన జీవితాంతం పోరాటం సలిపిన మహోన్నతవ్యక్తి సాయిబాబా అన్నారు. ఆయన ఆశయాలు కొనసాగించినప్పుడే అతనికి నిజమైన నివాళి అని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ నాయకులు టి.శ్రీరామమూర్తి, జె.రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

‘సీ-ఫేస్’ విన్యాసాలు

సింధియా, న్యూస్‌టుడే: సీ-ఫేస్ మలబార్-2024 విన్యాసాలు సోమవారం బంగాళాఖాతంలో జరిగాయని ఈఎన్‌సీ వర్గాలు తెలిపాయి. ఈ విన్యాసాల్లో భాగస్వామ్య దేశాలకు చెందిన వివిధ రకాల యుద్ధనౌకలు చురుగ్గా పాల్గొని అంతర్గత శక్తి సామర్థ్యాలను ప్రదర్శించినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి.



విన్యాసాల్లో పాల్గొన్న యుద్ధ నౌకలు

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM

ఎంవీపీకాలనీ 80085 74768 మద్దిలపాలెం 99121 20229

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

సమస్య : ఎంవీపీ సెక్టారు-11లో అమ్మవారి ఆలయం వీధిలో గోతులను ఇంకా పూడ్చలేదు - స్వరూప్

సమాధానం : పరిశీలించి గోతులను పూడ్చుతాం- శ్రీను, వర్క్ ఇన్‌స్పెక్టర్

వ్యర్థాలను తరలించారు

స్పందనకు వందనం

ఎంవీపీకాలనీ ఉషోదయకూడలికి వెళ్లే మార్గంలో ఆదర్శనగర్ వద్ద వ్యర్థాలు తొలగించలేదని వచ్చిన ఫిర్యాదుతో జీవీఎంసీ అధికారులు స్పందించారు. సిబ్బందిని నియమించి వ్యర్థాలను తొలగించి, పరిసరాలు శుభ్రం చేశారు.

-న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

నవరాత్రుల్లో నృత్య నీరాజనం

ఉత్సవాల్లో ప్రదర్శనలతో మెప్పిస్తున్న నగర కళాకారులు

న్యూస్‌టుడే, ఎఫ్.ఎం.కాలనీ (ఎంవీపీకాలనీ)

భగవంతుని సన్నిధిలో.. ఉత్సవమూర్తుల శోభాయాత్రల్లో.. ఇతరత్రా ఉత్సవాల్లో తమ నృత్య కళాప్రదర్శనలతో మెప్పిస్తున్నారు నగరానికి పలువురు కళాకారులు. ఇటీవల తిరుమలలో జరిగిన బ్రహ్మోత్సవాల్లోనూ నగరానికి చెందిన వెంకట అన్నమాచార్య సేవా ట్రస్టుకు చెందిన పలువురు కళాకారులు తమదైన శైలిలో నృత్య ప్రదర్శనలతో అలరించారు.



మాడవీధుల్లో నగర కళాకారుల నృత్యప్రదర్శన

ఉత్సవం ఏదైనా నృత్యసేవ...

భగవంతుడిని ఆరాధించే వారిలో ఆయనకు అందించే సేవల్లో ఒక్కొక్కరూ ఒక్కో మార్గాన్ని ఎంపిక చేసుకుంటున్నారు. నగరానికి చెందిన పలువురు నృత్య కళాకారులు భగవంతునికి తమ నాట్యంతో నీరాజనాలు సమర్పిస్తున్నారు.

★ నగరానికి చెందిన వెంకట అన్నమాచార్య సేవా ట్రస్టు డైరెక్టర్ కె.సునీత నేతృత్వంలో నృత్యరూపకాలను ప్రదర్శించి కళానైపుణ్యాన్ని చాటుతున్నారు.

★ శ్రీవారికి జరిగే బ్రహ్మోత్సవాల్లో 9 రోజుల పాటు తిరుమలలోనే బస చేసిమాడవీధుల్లో జరిగే శ్రీవారి ఊరేగింపులో భాగంగా రథం ముందు తమ ప్రదర్శనలిస్తూ అలరించారు. కేవలం శ్రీవారి ఆలయంలోనే కాకుండా దేశ వ్యాప్తంగా ఉన్న ప్రధాన ఆలయాల్లోనూ ట్రస్టు తరపున తమ కళాప్రదర్శనలతో మెప్పిస్తుంటారు. భరతనాట్యం, కథకళి, కూచిపూడి నృత్య కళాకారులు ఇలాంటి వేదికల వద్ద ప్రదర్శించి భక్తుల అభిమానాన్ని చూరగొంటున్నారు.

★ ప్రధాన దేవస్థానాల నుంచి అందుకున్న ఆహ్వానానికి అనుగుణంగా అక్కడ జరిగే సందర్భం, పరిస్థితులకు అనుగుణంగా నృత్యరీతులను సమకూర్చుకుని నృత్య ప్రదర్శనలు ఇస్తారు.

పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నాను



స్నేహాంజలి సంగీత నృత్యాలయంలో కూచిపూడి నేర్చుకుంటున్నాను. ఇటీవల బ్రహ్మోత్సవాల్లో మోహిని అట్టం నృత్యరూపకం ప్రదర్శించాను. స్వామివారి సింహవాహనం ముందు నృత్యప్రదర్శన చేయటం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. ఇంకా చాలా అదృష్టమనే చెప్పాలి. అన్నమయ్య సేవా ట్రస్టు ద్వారా నాకు ఈ అవకాశం దక్కింది.

-బి.రిషిత, కళాకారిణి

మొదటిసారైనా జీవితంలో మర్చిపోలేను



బ్రహ్మోత్సవాల్లో నృత్య ప్రదర్శనలు ఇవ్వటం అనేది మొదటిసారైనా జీవితంలో మర్చిపోలేను. జీవితంలో ఒక్కసారైనా ఇలా స్వామి వారి ముందు నృత్య ప్రదర్శన ఇవ్వాలని కోరిక ఉండేది. స్వామివారే నా కోరికను తీర్చటానికి ఒక అవకాశం కల్పించారని భావిస్తున్నాను.

– వర్ష, కళాకారిణి

ఎంతోమంది కళాకారులను తీర్చిదిద్ది ప్రదర్శనలిస్తున్నాం



చాలా కాలంగా చిన్న చిన్న కళాకారులను తీర్చిదిద్ది, వారి ద్వారా అనేక ఆలయాల్లో ప్రదర్శనలు ఇవ్వటం జరుగుతోంది. ప్రతీ కళాకారుడు భగవంతుని ముందు తమ ప్రదర్శనలు ఇవ్వాలని కోరుకుంటారు. బ్రహ్మోత్సవాల్లో మా నృత్య బృందాలు అమోఘంగా నృత్యరూపకాలను ప్రదర్శించి, అందరిని మెప్పించాయి.

– భాను రేఖ, సురేఖ నృత్య అకాడమీ

ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

హెచ్‌బీకాలనీ, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని మద్దిలపాలెంలో ఉన్న ప్రభుత్వ వృత్తి విద్య జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులు పసుపు రిబ్బన్లు ధరించి కళాశాల వద్ద నిరసన చేపట్టారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.క్రిష్టాఫర్, జిల్లా నాయకులు సి. హెచ్.త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.



పసుపు రిబ్బన్లు ధరించి నిరసన చేపట్టిన ఒప్పంద అధ్యాపకులు

అ వీ ఇ వీ

● బ్యాంకర్ల సమన్వయకర్తగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : నూతన మద్యం విధానంలో భాగంగా సోమవారం జరిగిన లాటరీ ద్వారా దుకాణాలు కేటాయింపులకు సంబంధించి బ్యాంకర్లకు సమన్వయకర్తగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ వ్యవహరించారు. బ్యాంకర్లతో మాట్లాడి వారి స్టాల్స్‌ను ఏర్పాటు చేయటం, ఎలాంటి ఆలస్యం లేకుండా లైసెన్స్ రుసుము చెల్లింపులు జరిగేలా చూడటం, దరఖాస్తుదారులకు ఎలాంటి సమస్యలు బ్యాంకర్లతో అనుసంధానం చేస్తూ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ పర్యవేక్షించారు.

● బంగారు పతక విజేతకు అభినందనలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఇటీవల జరిగిన జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీల్లో బంగారుపతకం సాధించిన కె.గౌతమ్‌ను సీతారామ సేవా సంఘం ప్రతినిధులు సత్కరించారు. గౌతమ్ బంగారు పతకాన్ని కైవసం చేసుకోవటం గ్రామానికి గర్వకారణమని సంఘం అధ్యక్షులు ఎ.పరదేశీ పేర్కొన్నారు. సంఘం కార్యవర్గ సభ్యులు, డిప్యూటీ మాజీ మేయర్ మళ్ల అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

● 4 కిలోల గంజాయి స్వాధీనం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: నగరంలోకి రవాణా చేస్తున్న గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెందుర్తి పోలీసుస్టేషన్ పరిధిలో అక్రమ రవాణాపై వచ్చిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా ఉంచారు. పలు వాహనాలు తనిఖీలు చేయగా, ఒక కారులో 4 కిలోల గంజాయిని గుర్తించారు. కారులో అక్రమ రవాణా చేస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని, కారును స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం పెందుర్తి స్టేషన్‌కు అప్పగించారు.

● జీవీఎంసీకి 65 వినతులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 65 వినతులు వచ్చాయి. మేయరు గొలగాని హరివెంకటకుమారి, ఇతర అధికారులు పాల్గొని వాటిని స్వీకరించారు. జోన్-1కు 1, జోన్-2కు 8, జోన్-3కు 10, జోన్-4కు 8, జోన్-5కు 9, జోన్-6కి 9, జోన్-7కు 1, జోన్-8కి 6, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి 13 చొప్పున అర్జీలు వచ్చాయి. జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి మాట్లాడుతూ ఫిర్యాదీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సోమన్నారాయణ, ప్రధాన ఇంజినీరు శివప్రసాదరాజు, డీసీ శ్రీనివాస్, ఇతర అధికారులు దామోదరరావు, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఉపాధ్యాయిని సరెండర్

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయిని రాధారాణిని సరెండర్ చేస్తూ విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎలమంచిలిలో పనిచేస్తున్న ఈమె సకాలంలో పాఠశాలకు రావడం లేదని వచ్చినా పాఠాలు బోధించడం లేదని ఇటీవల విద్యార్థినులు పాఠశాల ఆవరణలో ధర్నా నిర్వహించారు. దీనిపై ఆమెకు షోకాజ్ నోటీసు ఇచ్చిన అధికారులు విశాఖపట్నం డీఈవో కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారని అనకాపల్లి డీఈఓ వెంకట లక్ష్మమ్మ చెప్పారు.

ముగిసిన కూచిపూడి నృత్యోత్సవాలు



ఆటోమోటివ్, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో జరుగుతున్న కూచిపూడి నృత్యోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ నాట్య గురువు పసుమర్తి వెంకటేశ్వర శర్మకి వెంపటి చిన సత్యం జీవిత సాఫల్య 2024 పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాగంగా పలువురు కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇచ్చి ఆకట్టుకున్నారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయం కులపతి ఆచార్య జీఎస్ఎన్ రాజు, జిల్లా టూరిజం అధికారిణి జ్ఞానవేణి, తదితరులు పాల్గొన్నారు.




పసుమర్తి వెంకటేశ్వరశర్మకి వెంపటి చినసత్యం జీవిత సాఫల్య పురస్కారం అందించిన దృశ్యం

ఎరీనాలో ‘లాటరీ’ సందడి

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

మద్యం దుకాణాల కేటాయింపు లాటరీ విధానంతో వీఎంఆర్‌డీఏ బాలల ఎరీనా వద్ద సోమవారం సందడి నెలకొంది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లావ్యాప్తంగా 155 దుకాణాలకు లాటరీని తీసి వాటిని కేటాయించారు. ఈ నేపథ్యంలో బాలల ఎరీనా పరిసరాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎరీనాలోపలి భాగంలో అన్ని పోలీసు స్టేషన్లకు చెందిన భద్రతా సిబ్బంది ఉంటే, బయట ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు పర్యవేక్షించారు. లోపల డ్రా తీస్తుండగా బయట ఉన్నవారికి కనిపించేలా భారీ తెరను సైతం ఏర్పాటు చేశారు. ఒక్కో దుకాణానికి 5 నుంచి 10 నిమిషాల్లో డ్రా ప్రక్రియను పూర్తి చేశారు. దుకాణం వచ్చిన వారి వివరాలు నమోదుకు ఒక కౌంటర్, తర్వాతి స్థానంలో ఉన్న వారి వివరాలను నమోదుకు మరో కౌంటర్‌తో పాటు లైసెన్స్ రుసుము చెల్లించేందుకు వీలుగా బ్యాంకర్లతో స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఆవరణ అంతా సందడి వాతావరణం నెలకొంది. డ్రాలో దుకాణం రానివారంతా నిరాశగా వెనుదిరిగితే, వచ్చిన వారిలో పట్టలేనంత ఆనందం కనిపించింది.



స్టాల్స్ వద్ద రద్దీ



లాటరీకి వెళ్లేందుకు బారులు తీరిన దరఖాస్తుదారులు





బయట ఆవరణలో ఏర్పాటుచేసిన భారీ తెర, మోహరించిన పోలీసులు

ఆదాయం తెచ్చిపెట్టిన దసరా..



మద్దిలపాలెం, న్యూస్‌టుడే : ఆర్టీసీకి దసరా ఆదాయం తెచ్చిపెట్టింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని మద్దిలపాలెం సిటీ డిపో కాంప్లెక్సు నుంచి, విశాఖపట్నం డిపో నుంచి అత్యధిక బస్సులు (సర్వీసులు) కొనసాగించారు. ప్రధానంగా మద్దిలపాలెం సిటీ డిపో నుంచి హైదరాబాద్-2, విజయవాడ-5, అమలాపురం-4, కాకినాడ-6, శ్రీకాకుళం-8, విజయనగరం-5 సర్వీసులతో పాటు అదనంగా పార్వతీపురం, సాలూరు, బొబ్బిలి, టెక్కలి, ఇచ్ఛాపురం వరకు సర్వీసులు కొనసాగాయి. సాధారణ రోజుల్లో మద్దిలపాలెం సిటీడిపోనకు రోజు వారి ఆదాయం 12 లక్షలు సమకూరేది. దసరా సెలవులు ఇచ్చినప్పటి నుంచి రూ. 15 లక్షలు వరకు ఆదాయం వస్తోందని డిపో అధికారులు తెలిపారు. ఈ ఆదాయం బుధవారం వరకు కొనసాగే అవకాశం ఉందన్నారు.



మద్దిలపాలెం ఆర్టీసీ సిటీడిపో కాంప్లెక్సు

విశాఖపట్నం డిపో...

ఈ డిపో నుంచి హైదరాబాద్, విజయవాడ, కడప సర్వీసులు తిరుగుతుంటాయి. దసరా సీజన్ కావడంతో హైదరాబాద్‌కు 8 సర్వీసులు, విజయవాడకు 11 సర్వీసులు తిరుగుతున్నాయి. కడపకు ఒక సర్వీసు నడుస్తోంది. సాధారణ రోజుల్లో ఈ డిపోనకు రూ. 17 లక్షలు ఆదాయం వచ్చేది. దసరా సీజన్ కావడంతో గత ఐదురోజుల నుంచి డిపోనకు సుమారు రూ. 23 లక్షల వస్తోంది. రెండు, మూడు రోజులు ఈ ఆదాయం కొనసాగే అవకాశం ఉందన్నారు.

గద్దర్ సాహిత్యం ఎప్పటికి నిలిచే ఉంటుంది

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : గద్దర్ సాహిత్యం ఎప్పటికి నిలిచే ఉంటుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఈనెల 20న ‘గద్దరన్న యాదిలో’ కార్యక్రమం నిర్వహించటం అభినందనీయమన్నారు. సోమవారం ఆయన నివాసం వద్ద గోడపత్రికను ఆవిష్కరించారు. నగరంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కోరాడ రాజబాబు, డాక్టర్ పంచకర్ల రమేష్‌బాబు, ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ, పర్యావరణ కళామండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.రామకృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, తదితరులు

సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించొద్దు

ఎం.వి.పి. కాలనీ, న్యూస్‌టుడే : పోలీసు సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు విశేష స్పందన లభించింది. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. తక్షణమే సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించటంలో అలసత్వం వహించవద్దని ఆదేశించారు. సోమవారం పోలీసు సమావేశమందిరంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 58 మంది బాధితులు హాజరై తమ వినతులు సమర్పించారు.



బాధితులతో మాట్లాడుతున్న సి.పి. శంఖబ్రత బాగ్చీ

కనులపండువగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య కల్యాణోత్సవం సోమవారం సింహగిరిపై కనులపండువగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

కార్పొరేటర్ పి.వి.సురేష్‌పై రౌడీషీట్ ఎత్తివేయాలి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : కార్పొరేటర్ పి.వి. సురేష్‌పై రాజకీయ కక్షలతో ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశంతో నమోదు చేసిన రౌడీషీట్‌ను ఎత్తివేయాలని పలువురు వైకాపా కార్పొరేటర్లు సి.పి. శంఖబ్రత బాగ్చీని కోరారు. ఈ మేరకు సోమవారం డిప్యూటీ మేయర్ సతీష్ సారథ్యంలో సి.పి.ని కలిసి వినతిపత్రం అందజేశారు. తమ పార్టీ కార్పొరేటర్ సురేష్‌పై అక్రమ కేసులు నమోదు చేశారన్నారు. ఈ అంశాన్ని పరిశీలిస్తామని సి.పి. హామీ ఇచ్చారు. బాణాల శ్రీనివాస్, లావణ్య, సుధ , పలువురు వైకాపా కార్పొరేటర్లు పాల్గొన్నారు.



సి.పి.ని కలిసిన వైకాపా కార్పొరేటర్లు



కొండచిలువను పట్టుకున్న స్నేక్ క్యాచర్

కొండ చిలువ కలకలం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఎంవీపీకాలనీ రైతుబజారు బయట కొండచిలువ కలకలం రేకెత్తించింది. ప్రధాన రహదారిలోని ఆసుపత్రి పక్కనే ఉన్న వుడా నర్సరీ నుంచి వచ్చి ఉండవచ్చని భావిస్తున్నారు. ప్రధాన రహదారికి ఆనుకుని, అన్న క్యాంటీను భవనం దాటిన తర్వాత చిరు వ్యాపారులు ఆక్రమించగా, అక్కడ వెనుక భాగంలో కొండచిలువ కనిపించటంతో స్థానికులంతా బెంబేలెత్తిపోయారు. స్నేక్ క్యాచర్ కిరణ్ బంధించి జూకు అప్పగించారు.

పైడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో పురాతన వస్తుప్రదర్శన

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : విజయనగరంలో జరుగుతున్న పైడితల్లమ్మఅమ్మవారి ఉత్సవాల్లో జేఆర్.నగర్‌కు చెందిన విశ్రాంత బ్యాంకు ఉద్యోగి శివప్రకాష్ సేకరించిన పురాతన వస్తువులు, నాణేలు, తపాలా బిళ్లలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. విజయనగరం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఏర్పాటుచేసిన ప్రదర్శనలో భాగంగా శివప్రకాష్ సేకరించిన పలు వస్తువులను ప్రదర్శనకు ఉంచగా, వాటి గురించి సందర్శకులకు వివరించారు.



స్టాల్స్‌లో ఉంచిన వస్తువుల గురించి వివరిస్తున్న శివప్రకాష్

రైతుబజార్లకు నాణ్యమైన టమాటా

జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్‌శాఖ ఇన్‌ఛార్జి అధికారి రాకేష్

ఈనాడు కథనానికి స్పందన

కంచరపాలెం, న్యూస్‌టుడే: రైతుబజార్లకు నాణ్యమైన టమాటాలను మాత్రమే వినియోగదారులకు విక్రయించాలని జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్‌శాఖ ఇన్‌ఛార్జి అధికారి రాకేష్ తెలిపారు. ‘రైతుబజార్లకు కుళ్లిన టమాటా’ శీర్షికతో సోమవారం ‘ఈనాడు’లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. సోమవారం కంచరపాలెం రైతుబజారుకు వచ్చి టమాటాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12, 13 తేదీల్లో విశాఖలో రైతుబజార్లకు వచ్చిన టమాటా లోడులో అనంతపురం జిల్లాలో వర్షాలు పడడం వలన కొంత వరకు పాడయ్యాయన్నారు. దెబ్బతిన్న టమాటాను గ్రేడింగ్ చేసి రైతుబజార్లలో నాణ్యమైనవే వినియోగదారులకు విక్రయించాలని సంబంధిత ఎస్టేటు అధికారుల ద్వారా డ్వాక్రా గ్రూపులకు తెలియజేశామన్నారు.



టమాటాను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ ఇన్‌ఛార్జి అధికారి రాకేష్ తదితరులు

గోడపత్రిక ఆవిష్కరణ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : నవంబర్ 23, 24 తేదీల్లో వైజాగ్ జూనియర్ లిటరరీ ఫెస్ట్ జరగనుండగా.. ఆ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను సిరిపురంలోని ఓ హోటల్లో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, కంకటాల మల్లిక్, లాంటర్న్ కల్చరల్ అండ్ లిటరరీ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ సంధ్యా గోడే, ప్రియా ఉప్పలపాటి, సోనాల్ సార తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పైడా కృష్ణప్రసాద్, కంకటాల మల్లిక్, తదితరులు

ముఠా కార్మికులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలి

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ముఠా కార్మికులకు రావాల్సిన సర్వీస్ బెనిఫిట్స్‌ను తక్షణమే చెల్లించాలని విశాఖ జిల్లా ముఠాకార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.మన్మథరావు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.కె.రెహమాన్‌లు డిమాండ్ చేశారు. సోమవారం రేసపువానిపాలెంలోని ఓ మాల్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ మాల్ మూసివేయాలని యాజమాన్యం భావిస్తున్న తరుణంలో కార్మికులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. తక్షణమే సర్వీస్ బెనిఫిట్స్ అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూక నాయుడు, యేసుబాబు, ఎస్.అచ్చెంనాయుడు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న ఏఐటీయూసీ ముఠా కార్మిక సంఘం నాయకులు, కళాసీలు

విశాఖ ఉత్తరం
•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

పోర్టు హాస్పిటల్‌ను కాపాడుకోవాలి


రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న యూనియన్ నాయకులు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: విశాఖ పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను నిలిపివేయాలని కోరుతూ సాలగ్రామపురం పోర్టు హాస్పిటల్ వద్ద గత 14 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న కార్మికులకు ఏఐటీయూసీ మన్సాస్, హెచ్.ఎం.ఎస్.నాయకులు మంగనాయుడు సంఘీభావం తెలిపారు. విశాఖపట్నం అభివృద్ధికి పోర్టుట్రస్ట్ ఎంతో కృషి చేసిందని, దీన్ని మనం కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా

10 AM - 1 PM
విశాఖ ఉత్తరం: 80747 24699
విశాఖ దక్షిణం: 80085 66543

గురుద్వారా, న్యూస్‌టుడే

సమస్య: టీపీటీకాలనీ బద్దుగోపాల్ దుకాణం పక్కన మలుపు ప్రాంతంలో గొయ్యి ప్రమాదకరంగా ఉంది. వాహనాలు వెళ్లేటప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మూడు నెలలుగా సమస్య పరిష్కారం కాలేదు.
– రామారావు(వాహనదారుడు)

జ: సమస్యను పరిశీలించాం. గొయ్యి కప్పేలా చర్యలు తీసుకుంటాం.
– జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారి

అవీ ఇవీ

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

మురళీనగర్, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు అసదీప్ ఫౌండేషన్ ద్వారా కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ద్వారకానగర్ 4వ లైనులోని అనురత్న కమర్షియల్ కాంప్లెక్సు 3వ అంతస్తులో ఉన్న సంస్థ కార్యాలయంలో ఈ శిక్షణ ఉంటుంది. ఎంఎస్ ఆఫీస్, వెబ్ డిజైనింగ్, హార్డ్‌వేర్, నెట్‌వర్కింగ్, జావా, ఎ.డబ్ల్యు.ఎస్ తదితర కోర్సుల్లో 45 రోజుల నుంచి 3నెలల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు 90835 49323లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: 11 కె.వి. నరసింహనగర్ ఫీడర్‌లోని 132 కె.వి. హెచ్.టి. లైన్ల మరమ్మతులు, వర్షాకాల నేపథ్యంలో చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నరసింహనగర్ రైతుబజార్, విద్యుత్‌నగర్, జీస్ పోరమ్, ఆకాష్ జూనియర్ కళాశాల, పోర్టు సాగరమాల ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో దరఖాస్తులు

గురుద్వారా, న్యూస్‌టుడే: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. తహసీల్దార్ రమేష్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించి పరిశీలించారు. దరఖాస్తులు మంజూరులో జాప్యం లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. సిబ్బంది పాల్గొన్నారు.


దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్

గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన వ్యక్తి

మాధవధార, న్యూస్‌టుడే: ఎన్ఏడీ వంతెన కింద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో స్థానికులు గుర్తించి ఎయిర్‌పోర్టు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతి చెందిన వ్యక్తి వివరాల కోసం చుట్టుపక్కల వారిని వాకబు చేసినప్పటికీ ఎటువంటి ఆచూకీ లభించలేదు. సుమారు 30 సంవత్సరాల వయస్సు ఉంటుందని, కూలిపని చేస్తుంటాడని ప్రాథమికంగా నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కుటుంబ సభ్యులు, బంధువులు ఎవరైనా ఉంటే ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

పొంగి పొర్లుతున్న డ్రైనేజీ మురుగు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే

దొండపర్తి శ్రీసూర్యా కూడలిలోని రహదారుల పక్కనున్న డ్రైనేజీల్లో చెత్త చెదారాలు పేరుకుపోవడంతో అందులో మురుగు నీరు సజావుగా పారకుండా రహదారులపై పొంగి పొర్లుతోంది. గత రెండు రోజులుగా ఆ నాలుగురోడ్ల కూడలి నుంచి రైల్వే స్టేషన్ రోడ్డుకు వెళ్లే దారిలో మోర్ సూపర్ మార్కెట్ వద్ద ఆదివారం ఉదయం నుంచి కాల్వలో మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. దీనివల్ల ఆ రోడ్డులో ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ రోడ్డులో సినిమాహాలు, వ్యాపార సంస్థలు ఉన్నాయి. రైల్వేస్టేషన్‌కు, డి.ఆర్.ఎం. కార్యాలయానికి వెళ్లే వాహన చోదకులు, పాదచారులు గంటకు వందల సంఖ్యలో ప్రయాణాలు చేస్తుంటారు. వీరంతా నానా అవస్థలు పడుతుంటే.. సంబంధిత వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వచ్చి చూసి ఈ సమస్య తమకు సంబంధించింది కాదంటూ ఇంజినీరింగు విభాగం వారు చెయ్యాలంటూ చెప్పి వెళ్లిపోయారంటూ అక్కడి వ్యాపారులు, నివాసితులు చెబుతున్నారు.


శ్రీసూర్యాకూడలిలో రహదారులపై పొంగి పొర్లుతున్న డ్రైనేజీ మురుగు

రైతుబజార్లకు నాణ్యమైన టమాటా

జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్‌శాఖ ఇన్‌ఛార్జి అధికారి రాకేష్

ఈనాడు కథనానికి స్పందన

కంచరపాలెం, న్యూస్‌టుడే

రైతుబజార్లకు నాణ్యమైన టమాటాలను మాత్రమే వినియోగదారులకు విక్రయించాలని జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్‌శాఖ ఇన్‌ఛార్జి అధికారి రాకేష్ తెలిపారు. 'రైతుబజార్లకు కుళ్లిన టమాట' శీర్షికతో సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. సోమవారం కంచరపాలెం రైతుబజారుకు వచ్చి టమాటాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12, 13 తేదీల్లో విశాఖలో రైతుబజార్లకు వచ్చిన టమాటా లోడులో అనంతపురం జిల్లాలో వర్షాలు పడడం వలన కొంత వరకు పాడయ్యాయన్నారు. దెబ్బతిన్న టమాటాను గ్రేడింగ్ చేసి రైతుబజార్లలో నాణ్యమైనవే వినియోగదారులకు విక్రయించాలని సంబంధిత ఎస్టేటు అధికారుల ద్వారా డ్వాక్రా గ్రూపులకు తెలియజేశామన్నారు.


టమాటాను పరిశీలిస్తున్న జిల్లా అధికారి రాకేష్

స్వీడన్‌లో తెలుగు సంప్రదాయ బొమ్మల కొలువు


అందంగా అమర్చిన బొమ్మలకొలువు

మురళీనగర్, న్యూస్‌టుడే : విదేశాలలో మన భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పరిచయం చేస్తూ ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంటోంది. మహిళా వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులు ఎం.శేషామణి కుమార్తె వసుధ స్వీడన్‌లో తన నివాసంలో దసరా వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులో అలంకరించిన బొమ్మలు తెలుగు సంప్రదాయాల్ని అక్కడి వారికి పరిచేయం చేశాయి. చుట్టుపక్కల ఉన్న కుటుంబీకుల్ని ఆహ్వానించి బొమ్మలకొలువు విశేషాలను ఆమె వివరించారు. గత 12 సంవత్సరాలుగా ఈ బొమ్మల కొలువు ఏర్పాటు చేయడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని వసుధ పేర్కొన్నారు.

జెడ్సీ దృష్టికి కాలనీ సమస్యలు


జోన్-5 కమిషనర్‌తో మాట్లాడుతున్న నేతలు

మురళీనగర్, న్యూస్‌టుడే : మురళీనగర్ కాలనీ సమస్యలపై జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రామును సోమవారం స్థానిక తెదేపా నేతలు కలిసి చర్చించారు. ముఖ్యంగా వీధిదీపాల నిర్వహణ, కొత్తబల్బుల అమరికలో జాప్యం, అసాంఘిక కార్యకలాపాల నివారణ, బృందావన్ పార్కు, స్కేటింగ్‌పార్కు, అభివృద్ధి పనులపై జడ్సీకి వివరించారు. అన్ని అంశాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ వారికి హామీ ఇచ్చారు. 50వ వార్డు తెదేపా అధ్యక్షులు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు


పూజలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, తదితరులు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 27వ వార్డు పరిధి దొండపర్తి సమీపంలోని చుక్కావారివీధిలో మెగా బాలమిత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం ఉదయం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఆ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావుతో కలసి మండపాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. కమిటీ సభ్యులు వారిని శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. వార్డు తెదేపా అధ్యక్ష, కార్యదర్శులు అల్లూరి సత్యనారాయణరెడ్డి, పి.లక్ష్మీశివప్రసాద్, కూటమి నాయకులు శివ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పరదేశమ్మ ఆలయ ప్రాంగణంలో అన్నదానం

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే : తాటిచెట్లపాలెంలోని శ్రీపరదేశమ్మ అమ్మవారి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణం వద్ద అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ మాజీ అధ్యక్షులు నూనెల పోలారావు, గుంటూరు నర్సింహమూర్తి, అధ్యక్షులు దాడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బెదిరించేందుకు పురుగుల మందు తాగి యువతి మృతి

గురుద్వారా, న్యూస్‌టుడే: పెళ్లి విషయం ప్రస్తావించడంతో పురుగుల మందు తాగి యువతి బలవన్మరణానికి పాల్పడిన ఘటన సోమవారం అక్కయ్యపాలెంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన నట్టి రూపవతి (26) తల్లిదండ్రులతో కలిసి అక్కయ్యపాలెంలో నివశిస్తోంది. తండ్రి ఆదినారాయణ తాపీమేస్త్రీ కావడంతో ఇంటికి చేదోడు వాదోడుగా ఉండేందుకు మురళీనగర్‌లో గల పాత్రో డీపీఓ కేంద్రంలో ఉద్యోగం చేస్తోంది. ఇటీవల ఆమె పెళ్లి విషయమై కుటుంబసభ్యులు ప్రస్తావించగా దానికి నిరాకరించింది. తిరిగి సంబంధాలు చూడటంతో బెదిరించేందుకు ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో పురుగుల మందు తాగి ఇంట్లో పడిపోయింది. ఆపస్మారక స్థితిలో ఉన్న యువతిని సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ పరిస్థితి విషయంగా ఉండటంతో రాత్రి కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాంస్కృతిక విప్లవానికి బౌద్ధ ధర్మం ప్రతీక


బౌద్ధ విహార్‌లో మాట్లాడుతున్న పూజ్య భంతే అనాలయోలు

సీతంపేట, న్యూస్‌టుడే : సాంస్కృతిక విప్లవానికి ప్రతీకగా బౌద్ధ ధర్మం నిలుస్తోందని పలు సంఘాల నేతలు స్పష్టం చేశారు. రామాటాకీస్ దరి అంబేడ్కర్ భవన్‌లో గల బౌద్ధ విహార్‌లో అశోకుని బౌద్ధ విజయదశమి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, రమాబాయి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బుద్ధ విహార్‌లో బుద్ధుని విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి బుద్ధ వందనం చేశారు. కార్యక్రమంలో ఉండ్రాజవరం బౌద్ధ ధర్మ పీఠానికి చెందిన పూజ్య భంతే అనాలయో బౌద్ధ సందేశాన్ని ఇచ్చారు. ప్రపంచ మానవాళి శాంతి, సామరస్యం, సౌభాగ్యాలకు బౌద్ధ ధర్మమమే శరణ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ బుద్ధ విహార్ కన్వీనర్ బత్తుల గౌతం బాబు, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షులు కల్యాణ్‌రావు, ప్రధాన కార్యదర్శి జె.వి. ప్రభాకర్, డాక్టర్ మాటూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపు

కంచరపాలెం, న్యూస్‌టుడే

కంచరపాలెం రైతుబజారులో చెత్తాచెదారాలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి. చెత్తాచెదారాల వెంబడే వినియోగదారులు కూరగాయలు కొనుక్కోవలసి దుస్థితి నెలకొంది. దసరాకు వరుస సెలవులు రావడంతో శానిటరీ సిబ్బంది అటు వైపు చూడలేదు. సోమవారం 'ఈనాడు'లో చెత్తాచెదారాల నడుమ వినియోగదారుల అవస్థలపై ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శానిటరీ సిబ్బంది వచ్చి చెత్తను తొలగించారు.


రైతుబజారులో ఆదివారం పేరుకుపోయిన చెత్త మధ్య వినియోగదారులు


చెత్త తొలగింపు అనంతరం సోమవారం ఇలా..

చెల్లుబాటులో రూ.10 నాణేలు

గురుద్వారా, న్యూస్‌టుడే: పది రూపాయల నాణేలు చెల్లుబాటులో ఉన్నాయని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ అధికారి నరసింహకుమార్ అన్నారు. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు సోమవారం సీతమ్మధార రైతుబజార్‌లో బ్యాంకు ఆధ్వర్యంలో పది రూపాయల నాణేల మార్పిడి మేళా నిర్వహించారు. కార్యక్రమంలో ఉప ప్రాంతీయ అధికారి రమేశ్, విజిలెన్స్ అధికారి అజీమ్, రంగయ్యనాయుడు, తిరుమలకుమార్, ఆర్.వసంతరావు, బజార్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


వినియోగదారులకి నాణేలు అందజేస్తున్న దృశ్యం

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

మురళీనగర్, న్యూస్‌టుడే : సెక్టర్-13 భరద్వాజ క్షేత్రంలో సోమవారం సాయంత్రం రొంగలి రాములు అధ్యక్షతన అమరావతి విశ్వసాహితి సమ్మేళనం నిర్వహించారు. పోర్టుట్రస్టు విశ్రాంత ఉద్యోగి, 401 నాటకాలలో నటించిన రచయిత, నాటక కర్త పొలమరశెట్టి ఫ్రాన్సిస్‌ను ఘనంగా సత్కరించారు. ఫ్రాన్సిస్ సాహితీ సేవలను, నాటక రంగ అనుభవాలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో సి.హెచ్. చినసూర్యనారాయణ, డాక్టర్ దేవులపల్లి పద్మజ, తిరుపతిరావు, పి.ఎల్.వి.ప్రసాద్, కె.సన్యాసిరావు, బి.వెంకటేశ్వరరావు, పి.రామారావు, డి.ఎస్.కుమార్, ఎ.సత్యనారాయణ, డి.సాత్విక కవితలను చదివి వినిపించారు.


పొలమరశెట్టి ఫ్రాన్సిస్‌ను సత్కరిస్తున్న అమరావతి విశ్వసాహితీ సభ్యులు

ఉక్కు రక్షణకు పోస్టుకార్డు ఉద్యమం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనరు వీవీ రమణమూర్తి తెలిపారు. సోమవారం జీవీఎంసీ వద్ద ఆయన మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణకు 2025 జనవరి 27న లక్షమందితో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు దశలవారీ చేపట్టే కార్యక్రమాల వివరాలను ఆయన వెల్లడించారు. ప్రతి ఇంటి నుంచి కేంద్రానికి పోస్టు కార్డు పంపి నిరసనను తెలియజేయాలన్నారు. సీఎం చంద్రబాబు దిల్లీ వెళ్లి కేంద్రపెద్దలతో మాట్లాడతానని చెప్పారని, కాని అటువంటిది ఏమీ లేదని దుయ్యబట్టారు. దొడ్డిదారిలో ఉక్కును ప్రైవేటీకరణ చేయాలని మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు.

దుర్గమాంబ సేవలో ఎమ్మెల్యే వంశీకృష్ణ


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జీవీఎంసీ 36వ వార్డు మండావీధిలోని దుర్గమాంబ సహిత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సోమవారం జరిగిన శరన్నవరాత్రి పూజల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నసమారాధన ప్రారంభించారు. అమ్మవారి దయతో నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

కూలిన జామియా మసీదు పిట్టగోడ


మసీదు పిట్టగోడ కూలిన దృశ్యం

పూర్ణమార్కెట్ (అల్లిపురం), న్యూస్‌టుడే: నగరంలో ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షం కారణంగా చెంగలరావుపేటలోని జామియా మసీదు పిట్ట గోడ కూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. 70 ఏళ్ల నాటి మసీదు శిథిలావస్థకు చేరుకుందని, నూతన నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయడంతో పాటు నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలని మసీదు ప్రతినిధులు కోరుతున్నారు. ఘటన గురించి తెలుసుకున్న జోన్-4 జెడ్సీ మల్లయ్యనాయుడు క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక అందించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. అధికారులు మసీదును పరిశీలించి వివరాలను నమోదు చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు జెడ్సీ తెలిపారు.

గాడిన పడని చెత్త సేకరణ

ఏటా రూ.కోట్లలో వ్యయం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలో చెత్త సేకరణ పూర్తి స్థాయిలో గాడిన పడలేదు. జీవీఎంసీ ప్రజారోగ్య విభాగంలో పదిహేనేళ్ల నుంచి పిన్‌పాయింట్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఓ వీధికి ఇద్దరు నుంచి ముగ్గురు కార్మికులకు అప్పగించడమే ఈ కార్యక్రమం ఉద్దేశం. ఆ ప్రాంతంలో పరిసరాలను శుభ్రపరచడం, కాలువల్లో వ్యర్థాలు తొలగించడం వంటి పనులను ఆయా కార్మికులు చేయాల్సి ఉంటుంది. వార్డు పర్యావరణ, పారిశుద్ధ్య కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షిస్తుంటారు. పక్కాగా ఈ విధానం అమలవుతున్నట్లు అధికారులు చెబుతున్నా గెడ్డల్లో వ్యర్థాలు నానాటికీ పెరుగుతూనే ఉన్నాయి.

పూడికతీతకు ఏటా రూ.10కోట్ల వ్యయం: మహా విశాఖ నగరపాలక సంస్థ నిత్యం 1100 టన్నుల చెత్తను సేకరించి కాపులుప్పాడ డంపింగ్‌యార్డుకు తరలిస్తోంది. 5140 మంది పారిశుద్ధ్య కార్మికులు రహదారులు, వీధులను శుభ్రపరుస్తుండగా, 600 క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) వాహనాలు, 1200 మంది లోడర్లు గృహాల నుంచి నిత్యం చెత్తను సేకరిస్తున్నారు. 60 వాహనాలతో వాణిజ్య సముదాయాలు, వైద్యశాలల నుంచి వ్యర్థాలను సేకరిస్తున్నారు. అయినా నగరంలోని గెడ్డల నుంచి పూడికతీతకు ఏటా రూ.10కోట్లు జీవీఎంసీ వ్యయం చేయాల్సి వస్తోంది. అత్యవసర పనుల పేరిట మరో రూ.2కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు.


ఇళ్ల నుంచి చెత్త సేకరించి పుష్‌కార్టులో వేస్తున్న కార్మికులు

ఎక్కడ వైఫల్యం ఉందంటే..: నగరంలో మైదాన ప్రాంతాల నుంచి మాత్రమే చెత్త సేకరణ జరుగుతోంది. కొండవాలు ప్రాంతాలు, గెడ్డల పక్కనున్న ఆవాసాల నుంచి చెత్తను క్లాప్ వాహనాల ద్వారా సేకరించడం లేదు. కనీసం స్థానికులు వ్యర్థాలను వేయడానికి డంపర్‌బిన్నులను సైతం ఏర్పాటు చేయలేదు. దీంతో వ్యర్థాలను ప్లాస్టిక్ కవర్లలో చుట్టి గెడ్డల్లోకి విసిరేస్తున్నారు. వాణిజ్య సముదాయాలలో పనిచేస్తున్నవారు సైతం భారీగా థర్మాకోల్ షీట్లు, ప్లాస్టిక్ వ్యర్థాలను గెడ్డల్లో విసిరేస్తున్నారు. దీంతో ఏటా వేసవిలో జీవీఎంసీ రూ.10 కోట్లు వెచ్చించి గెడ్డల్లో వాటిని తొలగించాల్సి వస్తోంది. పాతనగరంలోని గంగులగెడ్డ, ఎస్ఎల్ కెనాల్, ఎర్రిగెడ్డలలో నిత్యం పూడికలు తొలగించాల్సి ఉండటంతో మరో రూ.2కోట్ల వరకు వ్యయం చేస్తున్నారు. కొండవాలు, గెడ్డల పక్కనున్న నివాసితులు, వాణిజ్య సముదాయాల వారికి గెడ్డల్లో చెత్త వేయకూడదని అవగాహన కల్పించడంతోపాటు, ఆయా ప్రాంతాలకు క్లాప్ వాహనాలను పంపించడం లేదా పుష్‌కార్టుల ద్వారా చెత్తను సేకరించగలిగితే జీవీఎంసీకి దాదాపు రూ.10 కోట్ల వరకు ఆదా అయ్యే అవకాశాలు ఉన్నాయి.

వేతన బకాయిలు చెల్లించాలని ఆందోళన


నిరసన తెలుపుతున్న కేజీహెచ్ భద్రతా సిబ్బంది

వన్‌టౌన్, న్యూస్‌టుడే: మూడు నెలల వేతన బకాయిలు చెల్లించాలని కేజీహెచ్ భద్రతా సిబ్బంది సోమవారం ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. గత 3నెలలుగా బకాయిలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రస్తుతం రూ.9090 మాత్రమే చెల్లిస్తున్నారని, న్యాయబద్ధంగా రూ.11,257 జీతం ఇవ్వాలని కోరారు. సీఐటీయూ నాయకులు ఎం.సుబ్బారావు, కె.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తదుపరి ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల వితరణ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్వామి వివేకానంద సేవా సంస్థ గౌరవాధ్యక్షులు డాక్టర్ జహీర్ అహ్మద్ పుట్టిన రోజును పురస్కరించుకొని సోమవారం పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. సంస్థ కార్యాలయ ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. రౌండ్‌టేబుల్ సంస్థ అధ్యక్షులు మక్సూద్ అహ్మద్, పిల్లల వైద్య నిపుణులు ముస్తాఫ్ అహ్మద్, సంస్థ అధ్యక్షులు సూరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రాయితీ టమాటా తూకాల్లో తేడా: రైతులు

వన్‌టౌన్: రాయితీ టమాటా విక్రయాల్లో నష్టాలు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. తూకాల్లో తేడా, నాణ్యత లేని సరకు కారణంగా బాస్కెట్‌కు 3 నుంచి 4 కిలోలు తగ్గిపోతున్నాయన్నారు. సోమవారం నర్సింహనగర్ రైతుబజార్ నుంచి పలువురు రైతులు కలెక్టరేట్‌కు వచ్చారు. రోజుకు ఒక్కో రైతుకు రూ.1000 నుంచి రూ.2వేల వరకు నష్టం వస్తోందని, ఇబ్బందులను మార్కెటింగ్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇచ్చిన సరకు విక్రయించాల్సిందేనని అధికారులు చెబుతున్నారని, న్యాయం చేయాలని కోరారు.

జీవీఎంసీకి 65 వినతులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 65 వినతులు వచ్చాయి. మేయరు గొలగాని హరివెంకటకుమారి, ఇతర అధికారులు పాల్గొని వాటిని స్వీకరించారు. జోన్-1కు 1, జోన్-2కు 8, జోన్-3కు 10, జోన్-4కు 8, జోన్-5కు 9, జోన్-6కి 9, జోన్-7కు 1, జోన్-8కి 6, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి 13 చొప్పున అర్జీలు వచ్చాయి. జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి మాట్లాడుతూ ఫిర్యాదీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సోమన్నారాయణ, ప్రధాన ఇంజినీరు శివప్రసాదరాజు, డీసీ శ్రీనివాస్, ఇతర అధికారులు దామోదరరావు, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న మేయరు గొలగాని హరివెంకటకుమారి

చికిత్స అందించి.. కోలుకొనేలా చేసి..


ఏయూటీడీ, శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధులతో బాధితులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మానసిక వ్యాధితో బాధపడుతున్న 9మంది ఏయూటీడీ, శ్రద్ధా ఫౌండేషన్ పర్యవేక్షణలో చికిత్స పొంది కోలుకొన్నారు. చిరునామాలు తెలియజేయడంతో వారిని కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు శ్రద్ధా కార్యాలయం ఉన్న ముంబయికి సోమవారం తరలించారు. హరిప్రసాద్ (రాయబరేలి), రామ్‌మనోహర్ (బెనారస్), గౌతమ్ (నేపాల్), గౌరంగోనాయక్ (ఒడిశా), జితేంద్రసాహు (ఛత్తీస్‌గఢ్), బిపిన్‌కుమార్ (బిహార్), గుదియాన, బిందో (బనారస్), సోనమ్, గ్వాలియర్ (మధ్యప్రదేశ్)లకు విశాఖలో చికిత్స అందించారు. ఈ మేరకు రెండో పట్టణ పోలీసు స్టేషన్ అధికారులు ధ్రువీకరిస్తూ ఇచ్చిన పత్రాల సహాయంతో వారిని అంబులెన్సులో ముంబయికి పంపామని సంస్థ ప్రతినిధులు ప్రగడ వాసు, ధృవ్ బడేకర్, సుప్రియ, అబిద్, నీలేష్ తెలిపారు.

కార్మికులను యథావిధిగా కొనసాగించాలి


కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ప్రతినిధులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని ఐఎంఎఫ్ఎల్ డిపో1, డిపో3ల్లో పనిచేస్తున్న ముఠా కార్మికులను యథావిధిగా కొనసాగించాలని విశాఖ జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. సోమవారం సంఘం సభ్యులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఒక్కోసారి పనులు లేకపోయినా డిపోలనే కనిపెట్టుకొని ఉన్నామని, తమకు ఉపాధి కల్పించి న్యాయం చేయాలని కోరారు. యూనియన్ నాయకులు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ డెయిరీ భూ అక్రమాలపై విచారణ జరపాలి'

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ సంస్థ చినగదిలి మండల పరిధి సర్వే సంఖ్య 13, 21, 26ల్లో భూ అక్రమాలకు పాల్పడిందని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్‌ను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఇదే విషయమై జీవీఎంసీ కమిషనర్, పోలీసు కమిషనర్‌కు సైతం ఫిర్యాదులు అందజేసినట్లు మూర్తియాదవ్ మీడియాకు తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన 20 ఎకరాల్లో...దాదాపు 12.05 ఎకరాలను హెల్త్‌సిటీ కోసం గతంలో కేటాయించారని, మిగిలిన 7.95 ఎకరాల్లో డెయిరీ సంస్థ వివిధ నిర్మాణాలు చేపట్టిందన్నారు. ఈభూమి విలువ రూ.500కోట్ల వరకు ఉంటుందని, దాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు.

నేడు కేంద్ర మంత్రి రాక

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి జయంత్ చౌధురి మంగళవారం విశాఖ రానున్నారు. ఉదయం 8.20గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. తర్వాత 9.30 గంటలకు మెడ్‌టెక్ జోన్‌కు వెళ్లి అక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 6.35 గంటల విమానంలో కేంద్ర మంత్రి తిరుగు ప్రయాణం కానున్నారు.

'జర్నలిజం హెచ్‌ఓడీ' డాక్టర్ వినయ్‌కుమార్ తొలగింపు

విచారణకు ఆదేశం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్రవిశ్వవిద్యాలయం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ వినయ్‌కుమార్‌పై వేటు పడింది. ఈ మేరకు సోమవారం రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు ఉత్తర్వులు జారీచేశారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావుకు హెచ్‌ఓడీగా ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. వినయ్‌కుమార్‌పై వస్తున్న ఆరోపణలపై విచారణ చేసి నివేదిక ఇచ్చేందుకు ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.సీతామాణిక్యం ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల బృందాన్ని నియమించారు. ★ ఏయూ జర్నలిజం విభాగాధిపతిగా ఉన్న డాక్టర్ వినయ్‌కుమార్ మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీ నుంచి ఏయూకు బదిలీపై రావడం, కృష్ణా యూనివర్సిటీలో ఒకరికి పీహెచ్‌డీ మంజూరు, ఉద్యోగులపై వేధింపులు...వంటి అంశాలపై ఆరోపణలు ఉన్నాయి. గవర్నర్, వర్సిటీ కులపతి జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదులందాయి. వారి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు వీసీ ఈ నిర్ణయం తీసుకున్నారు.

బ్రహ్మకుమారి సంస్థ సేవలు ప్రశంసనీయం

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే: బ్రహ్మకుమారి సంస్థ అందిస్తున్న ఆధ్యాత్మిక సేవలు ప్రశంసనీయమని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. బ్రహ్మకుమారి విశాఖపట్నం శాఖ మీడియా వింగ్ సర్వీస్ ఆధ్వర్యంలో సోమవారం సంస్థ కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ రాజస్థాన్ రాష్ట్రం మౌంట్ అబూలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన జాతీయ మీడియా ప్రతినిధుల సదస్సులో నిపుణులు చెప్పిన పలు అంశాలు జర్నలిస్టులు తమ వృత్తి నైపుణ్యం పెంచుకొనేందుకు ఉపయోగపడతాయన్నారు. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ పాత్రికేయులు నిజాన్ని నిర్భయంగా, స్వేచ్ఛగా రాయాలని కోరారు. అనంతరం మౌంట్‌అబూలో జరిగిన సదస్సులో పాల్గొన్న వారికి అభినందన పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ, చిత్రంలో ఎంపీ శ్రీభరత్ తదితరులు

'ఫ్రీహోల్డు ముసుగులో భూ అక్రమాలు'

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆనందపురం మండలం గిడిజాల గ్రామంలో ఫ్రీహోల్డు ముసుగులో భూ అక్రమాలు జరిగాయని, ఓ ప్రజాప్రతినిధి, అధికారులు ఏకమై తమ భూములు లాక్కొన్నారని స్థానిక రైతు కర్రి అప్పలనాయుడు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. సర్వే సంఖ్య 178-12లో 18 సెంట్ల భూమి ఉందని, 1970 నుంచి ఆ భూమి తమ ఆధీనంలో ఉండగా, ఇటీవల జరిగిన ఫ్రీహోల్డు సమయంలో 18 సెంట్లను మరో ముగ్గురు రైతుల పేరుతో రాసి ఇచ్చారన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు. ★ ఆనందపురం మండలం సర్వే సంఖ్య 185-10లోని 45 సెంట్ల భూమిని ఫ్రీహోల్డు సమయంలో వేరొకరి పేరున మార్చేశారని స్థానికులు పిణగం గౌరమ్మ తెలిపారు. తమకు అన్యాయం చేశారని, అక్రమాలపై లోతైన విచారణ జరిపించాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న గిడిజాల గ్రామ రైతులు

అధ్యయన యాత్రలతో ప్రజాధనం వృథా

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ కార్పొరేటర్లు చేపడుతున్న అధ్యయన యాత్రను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఫ్లోరులీడరు బి.గంగారావు, పార్టీ నాయకులు ఆర్కేఎస్‌వీ కుమార్, వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 20 నుంచి 27 వరకు నిర్వహించనున్న యాత్రలో అధ్యయనం కోసం కేవలం 3గంటలు మాత్రమే కేటాయించారని, మిగిలిన సమయమంతా విహారానికే కేటాయించడం దారుణమన్నారు. ఈ యాత్రను తమ కార్పొరేటరు గంగారావు బహిష్కరిస్తున్నట్లు చెప్పారు.

ఆరోగ్య శాఖలోకి బదలాయించాలని ధర్నా

కార్పొరేషన్, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయ ఆరోగ్య కార్యదర్శులను వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోకి బదలాయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జీవీఎంసీ ఎదుట ధర్నా నిర్వహించారు. యునైటెడ్ గ్రామ, వార్డు ఆరోగ్య కార్యకర్తల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు జగన్మోహనరావు మాట్లాడుతూ ఆరోగ్య కార్యదర్శుల సీనియార్టీ జాబితాలను తయారు చేసి ఎంపీహెచ్‌లుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. నాయకులు కుమార్, జగన్, పి.మణి, సుభాషిణి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యంపై విచారణకు వినతి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ పాలనలో చోటుచేసుకున్న కల్తీ మద్యం ఘటనలపై దర్యాప్తు చేయాలని విశాఖ లోక్‌సభ నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి కోరారు. ఈ మేరకు సోమవారం నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీని కలిసి వినతి పత్రం అందజేశారు. 2019-24 మధ్య కాలంలో కల్తీ మద్యం తాగి వేలాది మంది అస్వస్థతకు గురి కాగా, పలువురు మృతి చెందారని ఆరోపించారు. తెదేపా నాయకులు రామలక్ష్మి, కె.రాజు, డీఏ రాజు తదితరులు పాల్గొన్నారు.



సీపీకి వినతిపత్రం అందజేస్తున్న అనంతలక్ష్మి

మూడు సిండికేట్ల మాయాజాలం

ఎక్కువ దుకాణాలు వారికే...

మాధవధార, న్యూస్‌టుడే: విశాఖ జిల్లాకు సంబంధించి సోమవారం ఉదయం వీఎంఆర్‌డీఏ బాలల ప్రాంగణంలో నిర్వహించిన మద్యం దుకాణాల లాటరీ పారదర్శకంగా సాగింది. జిల్లాలో 155 దుకాణాలకు గాను, 4139 దరఖాస్తులు వచ్చాయి. ఉదయం 8 గంటల నుంచే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో గెజిట్ ప్రకారం ఒక్కో దుకాణానికి లాటరీ వేసే ప్రక్రియ ప్రారంభించగా, దరఖాస్తుదారులు ఉదయం 6 గంటలకే ప్రాంగణానికి చేరుకున్నారు. మధ్యాహ్నం 1 గంటకల్లా ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేశారు. గెజిట్ ప్రకారం ఒక్కో దుకాణానికి ఎంత మంది దరఖాస్తులు చేశారో, ఆ నంబర్ల ఆధారంగా ఒక డబ్బాలో వేసి వాటిలో వచ్చిన నంబర్ వారికి మద్యం దుకాణాన్ని కేటాయించారు.

తొలి వ్యక్తులే అన్నీ దక్కించుకుని..

ఒక్కో షాపునకు లాటరీలో ముగ్గుర్ని ఎంపిక చేశారు. లాటరీ దక్కించుకున్న వ్యక్తి ఆరో వంతు ఫీజు చెల్లించి, బ్యాంకు గ్యారెంటీ ఇవ్వాల్సి ఉంది. ఒకవేళ ఆ ముగ్గురిలో మొదటి వ్యక్తి వచ్చి చెల్లింపు చేస్తే ఎటువంటి అభ్యంతరం ఉండదు. అతను చెల్లించని పక్షంలో రిజర్వులో ఉంచిన రెండు, మూడో వ్యక్తులకు అవకాశం కల్పించేలా ఏర్పాట్లు చేశారు. అయితే లాటరీలో ఎంపిక చేసిన ముగ్గురిలో మొదటి వ్యక్తులే అన్ని దుకాణాలకు ఆరో వంతు ఫీజులు చెల్లించి దక్కించుకున్నారు.

అన్ని పార్టీల వారూ ఉన్నారు

మద్యం దుకాణాల లాటరీ బయటకు మామూలుగా కనిపించినప్పటికీ, నగరానికి చెందిన మూడు సిండికేట్ల మధ్య పోటాపోటీగా జరిగింది. ఒక్కో సిండికేటు నుంచి 200 నుంచి 500 దరఖాస్తులు వారి బంధువులు, అనుచరులతో వేయించారు. లాటరీలో మూడు సిండికేట్లకు చెందిన వ్యక్తులే ఎక్కువ దుకాణాలను దక్కించుకున్నారు. వీరితో పాటుగా కొందరు రాజకీయ నాయకులు నేరుగా షాపుల వేలంలో పాల్గొన్నారు. మరికొందరు వారి బంధువుల, అనుచరులతో వేయించి బయట ఉండి అంతా నడిపించారు. మద్యం దుకాణాల టెండర్లలో అన్ని రాజకీయ పార్టీ నాయకుల భాగస్వామ్యం పెద్ద ఎత్తున కనబడింది.



లాటరీలో పాల్గొన్న దరఖాస్తుదారుల టోకెన్ నెంబర్లను పరిశీలిస్తున్న పోలీసులు

దుకాణాలకు భారీ డిమాండ్

ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలైనా పొందవచ్చు, లైసెన్సు పొందిన వ్యక్తి నగర పరిధిలో ఎక్కడైనా దుకాణాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. దీంతో ఇప్పుడు లైసెన్సు పొందిన వారికి దుకాణాల ఏర్పాటుకు భారీ డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం జిల్లాలో 138 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇవన్నీ అద్దె ప్రాంగణాల్లో నడుస్తున్నవే. ఇందులో ఎక్కువగా వ్యాపారం జరిగే ప్రాంతాల్లో ఉన్న మద్యం దుకాణాలకు మద్యం వ్యాపారులు మూడు నెలలు ముందుగానే అడ్వాన్స్ ఇచ్చి నిలుపుకొన్నారు. ఇప్పటికే నడుస్తూ, మందు బాబులకు అలవాటైన ఈ దుకాణాలన్నింటినీ కొంత మంది తమ ఆధీనంలో పెట్టుకున్నారు. ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేయబోయే 155 దుకాణాల లైసెన్సులు పొందిన వారు తమ దుకాణాల్ని ఎక్కడ ఏర్పాటు చేసుకోవాలనేది లావాదేవీల ద్వారా తేల్చుకోవాల్సిందే.

పెరగనున్న ఐటీ నియామకాలు: గంటా



శ్రీటెక్ సాఫ్ట్‌వేర్ సంస్థను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

కొమ్మాది, న్యూస్‌టుడే: ఐటీ కంపెనీల్లో నియామకాల ప్రక్రియ వృద్ధి చెందుతోందని, మరిన్ని సంస్థలు విశాఖ తరలివచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వ కృషి చేస్తోందని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మారికవలసలో కొత్తగా ఏర్పాటు చేసిన శ్రీటెక్ సాఫ్ట్‌వేర్ సంస్థను సోమవారం ఆయన ఎంపీ శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ ఐటీకి సంబంధించి ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, రానున్న అయిదేళ్లలో వీటిని రెట్టింపు చేసేందుకు ఉమ్మడి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ విశాఖ ఐటీ హబ్‌గా మారనుందని, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ కృషితో టీసీఎస్ సంస్థ ద్వారా 10వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు రానున్నాయన్నారు. శ్రీటెక్ సీఈవో తోట హరి మాట్లాడుతూ తమ సంస్థ 400మందికి పైగా ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించనుందన్నారు. మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, జనసేన భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త పంచకర్ల సందీప్, 5వవార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, సంస్థ డైరెక్టర్ కృష్ణప్రసాద్, ఆపరేషన్ మేనేజర్ వెంకట్, మేనేజర్లు ఈశ్వర్, ప్రవీణ్, జనసేన 5వ వార్డు అధ్యక్షుడు దేవర శివ పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ ప్రారంభం



బ్యాంక్ శాఖను ప్రారంభిస్తున్న నేవల్ డాక్‌యార్డు ఏఎస్‌డీ శ్రీనివాస్

సింధియా, న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతం సింధియాలో సోమవారం బ్యాంక్ ఆఫ్ బరోడా తన శాఖను ప్రారంభించింది. ఈ శాఖను ఈస్టర్న్ నేవల్ కమాండ్‌కు చెందిన నేవల్ డాక్‌యార్డు అడ్మిరల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌సీఎస్ రీజనల్ మేనేజర్ రఘురామన్ చక్రవర్తి, బీవోబీ రీజనల్ మేనేజర్ పి.ఎం.పథాన్, డీఆర్‌ఎం సతీషా సాలుంకే, బీఎం సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

విశాఖ వేదికగా న్యూరాలజీ వైద్యుల జాతీయ సదస్సు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: న్యూరాలజీ వైద్య రంగంలో వస్తున్న ఆధునిక పోకడలు, వ్యాధుల నిర్ధారణ, చికిత్సా విధానాలపై ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు విశాఖలో జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఆంధ్ర వైద్య కళాశాల(ఏఎంసీ) న్యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో 31వ ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ నేషనల్ కాన్ఫరెన్సును విశాఖ వేదికగా నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, సదస్సు కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎస్.గోపి, ఇతర ప్రతినిధులు డాక్టర్ సతీష్, డాక్టర్ సుష్మ వెల్లడించారు. సోమవారం కళాశాల ఆవరణలో జరిగిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ బుచ్చిరాజు మాట్లాడుతూ 21 ఏళ్ల తర్వాత జాతీయ సదస్సును నిర్వహించే అవకాశం ఏఎంసీకి లభించిందని, పలు రాష్ట్రాలతో పోటీ పడి సదస్సు నిర్వహణ బాధ్యతలను దక్కించుకున్నట్లు చెప్పారు. ఐఏఎన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ దేబాసిష్ చౌధురి సహా పలువురు జాతీయ కార్యవర్గ సభ్యులు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో పేరొందిన ఆరుగురు వైద్య నిపుణులకు జీవితకాల సాఫల్య పురస్కారాలు, 8 మంది న్యూరాలజిస్టులకు ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ ఫెలోషిప్‌లను అందజేస్తామని డాక్టర్ బుచ్చిరాజు వివరించారు.



సదస్సు బ్రోచర్‌ను విడుదల చేస్తున్న డాక్టర్ బుచ్చిరాజు, డాక్టర్ గోపి, తదితరులు

గుండె జబ్బులపై అవగాహన అవసరం

ఆరిలోవ, న్యూస్‌టుడే : ఆరిలోవ హెల్త్‌సిటీలో ఉన్న అపోలో ఆసుపత్రిలో సోమవారం చెస్ట్ పెయిన్ క్లినిక్‌ను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్న వయసులోనే గుండె జబ్బులబారిన పడుతున్నారని.. దీనిపై ప్రాథమిక అవగాహన కలిగించాలన్నారు. అపోలో వైద్య బృందం దీనికి సహకరించాలన్నారు. ఆసుపత్రుల్లో మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అపోలో రీజనల్ సీఈవో వై.సుబ్రహ్మణ్యం, సీఓఓ రామచంద్ర, డాక్టర్ డి.కె బారువా, డాక్టర్ శశాంక, డాక్టర్ చక్రధర్, డాక్టర్ రవికాంత్, తదితర వైద్య బృందం సభ్యులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న హోంమంత్రి అనిత

అప్పన్న సన్నిధిలో 'విశ్వం' చిత్ర బృందం



ఆలయ ప్రాంగణంలో హీరో గోపీచంద్, దర్శకుడు శ్రీను వైట్ల తదితరులు

సింహాచలం, న్యూస్‌టుడే: ఇటీవల విడుదలైన విశ్వం చిత్ర బృందం సోమవారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకుంది. చిత్ర కథానాయకుడు గోపీచంద్, దర్శకుడు శ్రీను వైట్ల, నటులు పృధ్వీరాజ్, బెనర్జీ, షకలక శంకర్, ఇతర సాంకేతిక నిపుణులు సింహగిరికి విచ్చేశారు. వారికి అధికారులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ప్రభుత్వ ఐటీఐల డీఎల్‌టీసీఎస్ అధ్యక్షునిగా ఈశ్వరరావు

కంచరపాలెం, న్యూస్‌టుడే: జిల్లా ప్రభుత్వ ఐటీఐల డీఎల్‌టీసీఎస్ (డిస్ట్రిక్ లెవెల్ ట్రైనింగ్ సెంటరు స్టాఫ్ అసోసియేషన్) నూతన కార్యవర్గాన్ని సోమవారం ప్రభుత్వ పాత ఐటీఐలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా బి.ఈశ్వరరావు, ఉపాధ్యక్షులుగా డి.వెంకటేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా జి.వి.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా ఆర్.సతీష్‌కుమార్, సిహెచ్.లలితకుమారి, కోశాధికారిగా వి.శ్రీనివాసరావు, సభ్యులుగా కె.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, జె.సత్యనారాయణ, ఎస్.వి.వి.ఎన్.వరప్రసాద్‌లు ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులతో ఎన్నికల అధికారులు కె.ఎస్. శ్రీనివాసరావు, ఎం.రవికుమార్‌లు ప్రమాణ స్వీకారం చేయించారు. ఎన్నికల పరిశీలకునిగా ఎ.పి.ఎన్.జి.ఒ.ఎస్.ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.అప్పలరాజు వ్యవహరించారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న కొత్తగా ఎన్నికైన ప్రతినిధులు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	125	120
లైవ్	147	140
డ్రెస్డ్	213	250
స్కిన్‌లెస్	243	260

28న విశాఖ ఉక్కులో సమ్మె

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 28న విశాఖ ఉక్కులో సమ్మె నిర్వహించనున్నట్లు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు వీరు సమ్మె నోటీసును ఉక్కు సీజీయం (హెచ్‌ఆర్) జి.గాంధీకి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, ఇంటక్, సిటూ ఇతర కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గాజువాక
•గాజువాక •విశాఖ పశ్చిమం


డీసీపీ మేరీ ప్రశాంతిని అభినందిస్తున్న పోలీసులు

నూతన డీసీపీ బాధ్యతల స్వీకరణ

గాజువాక, న్యూస్‌టుడే: విశాఖ జోన్-2 డీసీపీగా మేరీ ప్రశాంతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీసీపీగా పని చేసిన తుహిన్ సిన్హా అనకాపల్లి ఎస్పీగా బదిలీకావడంతో ఆయన స్థానంలో ఏలూరు ఎస్పీగా పని చేసిన ప్రశాంతిని ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా సౌత్ ఏసీపీ త్రినాథ్, పలువురు సీఐలు, ఎస్‌లు పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: అక్కిరెడ్డిపాలెం రామాలయం వద్ద దుర్గాదేవి మండపంలో సోమవారం స్థానిక చిన్నారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కిరెడ్డిపాలెం దుర్గమాంబ-కుంచమాంబ ఆలయ ప్రాంగణంలో దేవీ అమ్మవారి రూపంలో దీపాలు అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు.


దేవి రూపంలో దీపాలంకరణ

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే

సమస్య: గాజువాక 76వ వార్డు నడుపూరు రోడ్డులో మందుబాబుల అల్లరి మరీ ఎక్కువైంది. గాంధీపార్కు ఏరియా, వంతెన రోడ్డు వద్ద రాత్రయితే మహిళలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. **- నాగేశ్వరరావు, నడుపూరు**

సమాధానం: రాత్రి సిబ్బందిని పంపి మందుబాబులపై కేసులు పెడతాం. **- దాలిబాబు, సీఐ**

సమస్య: సీతారామ్‌నగర్‌లో వీధి దీపాలు పడకేశాయి. **- దేవి, బీసీ రోడ్డు**

సమాధానం: సిబ్బందిని పంపి దీపాలను పరిశీలిస్తాం. **- శివ, వీధి దీపాల నిర్వహకుడు**

డ్రైనేజీలు స్తంభించి.. మురుగు రోడ్డెక్కి


శ్రీనగర్ అఫీషియల్ కాలనీలో పూడికతీత పనులు

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే

అకాల వర్షానికి సోమవారం గాజువాకలో ప్రధాన రహదారులు, వీధులు చిత్తడిగా మారాయి. ఎక్కడికక్కడ డ్రైనేజీలు స్తంభించి మురుగు రోడ్కెక్కింది. లోతట్టుకాలనీల్లోకి గెడ్డ నీరు దాడి చేయడంతో జీవీఎంసీ ప్రజా ఆరోగ్య సిబ్బంది అప్రమత్తమై అదనపు సిబ్బందితో కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టారు. పలుచోట్ల డ్రైనేజీ అవుట్ లేనందున కొద్దిపాటి వర్షాలకు వరద రోడ్లపై పారుతోంది. బీసీ రోడ్డు, కణితిరోడ్డు, చినగంట్యాడ, మున్సిపల్‌రోడ్డు, కుంచమాంబకాలనీ, పాత అయ్యన్నపాలెంలో కాలువలు నిండిపోవడంతో నివాసితులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. దయాల్‌నగర్‌లో ధ్వంసమైన కాలువల కారణంగా మురుగుతో నానా ఇబ్బందులు పడ్డారు. జెడ్సీ శేషాద్రి, జోన్-6 ఏఎంఓహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్ దగ్గరుండి పూడికతీత పనులు చేపట్టారు. తరచూ వర్షాలకు అవస్థలు పడుతున్న దృష్ట్యా శాశ్వత నివారణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


గాజువాకలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఏఎంఓహెచ్ కిరణ్‌కుమార్


పెదగంట్యాడలో మూసుకుపోయిన కాలువ పునరుద్ధరణ

యథేచ్ఛగా రహదారి ఆక్రమణ

మల్కాపురం, న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతంలోని రహదారులు, ఫుట్‌పాత్‌లు, కాలువలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు, తరచూ ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురం కూడలి నుంచి జనతాకాలనీ వైపుగా వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఆక్రమించేసి బడ్డీలు ఏర్పాటు చేయడం, ఇసుక, పిక్క నిల్వ ఉంచి వ్యాపారాలు చేస్తున్నారు. సంబంధిత అధికార యంత్రాంగం, సచివాలయం సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని దీనిపై పలుమార్లు ఫిర్యాదులు చేసిన ప్రయోజనం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు ఆక్రమణతో ఆర్టీసీ బస్సు డ్రైవర్లు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ కారణంగా గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోతున్నాయి. ఈ సమస్యపై పట్టణ ప్రణాళిక అధికారి విజయ్‌కుమార్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా రోడ్డుకు అనుకొని ఉన్న దుకాణాలు, ఇతర సామగ్రిని తొలగించేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు.


త్రినాథపురం నుంచి దుర్గానగర్ వెళ్లే రోడ్డును అనుకుని ఏర్పాటు చేసిన బడ్డీలు

సంక్షిప్త సమాచారం..

● ఐఎన్ఎస్ వీరబాహు సీవోగా కమొడోర్ కెల్కార్

సింధియా, న్యూస్‌టుడే: తూర్పు నౌకాదళ ముఖ్య కార్యాలయం పరిధికి చెందిన ఐఎన్ఎస్ వీరబాహుకు కమాండింగ్ అధికారిగా కమొడోర్ హెచ్ఎస్ కెల్కార్ సోమవారం బాధ్యతలు చేపట్టినట్లు ఈఎన్‌సీ వర్గాలు తెలిపాయి. ఈయన 1997లో భారత నౌకాదళ సర్వీసులో చేరారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ ఖడక్‌వాస్లాలో శిక్షణ, విద్యాభ్యాసం సాగించినట్లు పేర్కొన్నాయి. ఇప్పటి వరకు ఈయన వివిధ నేవల్ కమాండ్ల స్టాఫ్ నియామకంలో కీలక విధులు సమర్థంగా నిర్వర్తించినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి.

● అగనంపూడి యువకుడి గల్లంతు



అగనంపూడి, న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో సరదాగా గడిపేందుకు ఒడిశాలోని బంధువుల ఇంటికెళ్లిన యువకుడు నదిలో స్నానానికి దిగి గల్లంతైన ఘటన ఇది. అగనంపూడి కొండయ్యవలస కాలనీకి చెందిన కంచిపాటి నరసింహమూర్తి రెండో కుమారుడు **సాత్విక్ (18)** గాజువాకలోని ఒక ప్రయివేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల తన సోదరి మోహిత్‌తో కలిసి ఒడిశా సుందరగఢ్ జిల్లా దార్లిపాలి వద్దనున్న మేనమామ ఇంటికి వెళ్లాడు. బంధువులతో కలిసి విహారయాత్రకు ఆదివారం పర్యాటక ప్రాంతం కనకుండ వెళ్లాడు. అక్కడి నదిలో స్నానం చేస్తుండగా సాత్విక్ గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న తలసారా పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. రెండు రోజులుగా వెతుకుతున్నా సాత్విక్ ఆచూకీ తెలియకపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

● నేడు అదనపు భవనం ప్రారంభం

సింధియా, న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతం శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఈనెల 15న తేదీన అదనపు భవనం ప్రారంభం కానుంది. ఈమేరకు కోరమాండల్ ఇంటర్నేషనల్ తన సామాజిక బాధ్యత నిధులు వెచ్చించి ఈ భవనం నిర్మించింది. దీన్ని ఉదయం 9.30 గంటలకు పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ప్రారంభిస్తారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

● గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



గాజువాక, న్యూస్‌టుడే: హిందుస్థాన్ జింక్ పాత క్వార్టర్స్ వద్ద గుర్తు తెలియన వ్యక్తి (55) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు గాజువాక పోలీసులు కేసు నమోదు చేశారు. క్వార్టర్ సమీపంలో చెట్టుకు ఒక వ్యక్తి ఉరేసుకుని వేలాడుతుండడం చూసి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ పార్థసారధి నేతృత్వంలో ఎస్ఐలు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. గ్రే కలర్ హాఫ్ ప్యాంటు, తెల్ల గ్రే డిజైన్ షర్టు ధరించిన వ్యక్తి వివరాలు తెలియక మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు.

● 4 కిలోల గంజాయి స్వాధీనం

ఎం.వి.పి.కాలనీ: పెందుర్తి పోలీసుస్టేషన్ పరిధిలో అక్రమ రవాణాపై వచ్చిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా ఉంచారు. పలు వాహనాలు తనిఖీలు చేయగా, ఒక కారులో 4 కిలోల గంజాయిని గుర్తించారు. కారులో అక్రమ రవాణా చేస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని, కారును స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం పెందుర్తి స్టేషన్‌కు అప్పగించారు.

సేవలకు గుర్తింపు

సింధియా, న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతంలో మూడు దశాబ్దాలుగా అందిస్తున్న సేవలు అభినందనీయమని కేఎస్ఎన్ రెడ్డి స్మారక సేవా కార్యక్రమాల నిర్వాహకుడు కె.శివాజీరెడ్డిని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు కొనియాడారు. ఈ మేరకు సోమవారం శ్రీహరిపురంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఏటా విజయదశమి ఉత్సవాలకు తన వంతు సహకారాన్ని అందిస్తుండటం పట్ల శివాజీరెడ్డిని అభినందించారు. అనంతరం అన్న సమారాధనను ప్రారంభించారు. తొలుత దుర్గాదేవి మండపం వద్ద శివాజీ రెడ్డిని ఎమ్మెల్యే సత్కరించారు. ఎమ్మెల్యేను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో వార్డు తెదేపా అధ్యక్షులు కోరాడ శ్రీనివాసరావు, శీరం ఉమామహేశ్వరి, పోతాబత్తుల శ్రీను, సీహెచ్.రాము తదితరులు పాల్గొన్నారు.


వ్యాపారవేత్త శివాజీరెడ్డిని సత్కరించిన ఎమ్మెల్యే గణబాబు తదితరులు

ఆదాయపు పన్ను పత్రాల సమర్పణపై అవగాహన


మాట్లాడుతున్న ఆదాయపు పన్ను అధికారులు కె.ప్రసాద్ తదితరులు

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారం బలమైన పునాది కలిగి ఉందని, ఇది దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని విశాఖపట్నం ఇన్‌కమ్‌టాక్స్ సర్కిల్ జాయింటు కమిషనర్ కె.ప్రసాద్ అన్నారు. ఉక్కునగరంలో సోమవారం నిర్వహించిన టీడీఎస్ అవుటు రీచ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఆదాయపు పన్ను విభాగంలో జరుగుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియను వివరించారు. ఐటీ మినహాయింపుల నిజమైన క్లయిమ్‌లపై విభాగం సిబ్బంది సలహాలను జారీ చేయడానికి, పన్ను చెల్లింపుదారుల సేవలు, ఆదాయపు పన్ను శాఖలో ఇటీవలి పరిణామాలు, పలు పథకాలు తదితర అంశాలపై ఉక్కు ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆదాయపు పన్ను కమిషనర్ ఇజ్జాడ మధుసూదనరావు, పలువురు ఉక్కు అధికారులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

అగనంపూడి, న్యూస్‌టుడే: సమాజంలో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ ఎంతగానో పాటు పడ్డారని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కొనియాడారు. సోమవారం అగనంపూడి పరిధి కొండయ్యవలస కాలనీలో మహాత్మా జ్యోతీరావు పులే అంబేడ్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని హక్కులను కాపాడుకోవాలని కోరారు. 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, సంఘం ప్రతినిధులు కె.పరంధామయ్య, పైడిరత్నం, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా తదితరులు

నీరు మళ్లించారు



గాజువాక, న్యూస్‌టుడే: గాజువాక కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (కేబీఆర్) సుందరయ్యకాలనీ వద్ద రెండు రోజులుగా రోడ్డెక్కిన నీటికి ఎట్టకేలకు జీవీఎంసీ నీటి సరఫరా సిబ్బంది అడ్డుకట్ట వేశారు. సోమవారం 'ఏరులైన నిర్లక్ష్యం..' శీర్షికతో వార్త ప్రచురితమైంది. పంపుహౌస్ నుంచి నీరుపొంగి రోడ్డును ముంచెత్తడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. స్పందించిన అధికారులు జేసీబీని రంగంలోకి దింపి నీటిని మళ్లించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. యూజీడీ లైను అవుట్ లేక నీరంతా రోడ్డుపై దాడి చేసిందని మున్ముందు ఇబ్బందుల్లేకుండా చూస్తామని పేర్కొన్నారు.

స్పందనకు వందనం

ప్రత్యేక శుభ్రత పనులు షురూ..

గాజువాక, న్యూస్‌టుడే: దసరా పండగ నేపథ్యంలో పారిశుద్ధ్య సిబ్బంది విధులకు హాజరుకాకపోవడంతో గాజువాకలోని ప్రధాన రహదారులు, వీధుల్లో 'పేరుకుపోయిన చెత్త కుప్పలు మోక్షం కలిగించే..' 'ఈనాడు'లో 'కదలని వ్యర్థాలు' శీర్షికతో వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు సోమవారం ఉదయం అదనపు సిబ్బందిని రంగంలోకి దింపి ప్రత్యేక శుభ్రత పనులు చేపట్టారు. ఉక్కు నిర్వాసిత కాలనీల్లో గ్యాంగ్ వర్కు పేరుతో వ్యర్థాలను డంపింగ్‌యార్డుకు తరలించారు.


చెత్త తొలగిస్తున్న సిబ్బంది

వైభవంగా దుర్గాదేవి అనుపోత్సవం


ములగాడ కాలనీలో..


అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే గణబాబు, పార్టీ నాయకులు


రాసాలమ్మకాలనీలో పూజలు చేస్తున్న 86వ వార్డు కార్పొరేటర్ కోటేశ్వరరావు

గాజువాక, న్యూస్‌టుడే: గాజువాక బీసీ రోడ్డు సీతారామ్‌నగర్‌లో శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా సోమవారం రాత్రి అమ్మవారి అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో భవానీ భక్తులు దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఊరేగించారు. నేలవేషాలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి.

హర్షవర్ధపాలెం, న్యూస్‌టుడే: రాసాలమ్మకాలనీలో గౌరీ పరమేశ్వర, రాసాలమ్మ ఆటో స్టాండ్ డ్రైవర్లు, యజమానుల సంఘం ఆధ్వర్యంలో దుర్గాదేవి అనుపు మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 86వ వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి నిమజ్జనం జరిగింది.

మల్కాపురం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా సోమవారం 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లోని దుర్గా యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా వేడుకల్లో ఎమ్మెల్యే గణబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నసమారాధన ప్రారంభించారు.

సింధియా(నెహ్రూనగర్), న్యూస్‌టుడే: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలో పలుచోట్ల ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు. ములగాడ హౌసింగ్ కాలనీ, మారుతీనగర్‌లో నవరాత్రి ఉత్సవాల అనంతరం సోమవారం సాయంత్రం ఆరంభించిన ఊరేగింపు రాత్రి వరకు కొనసాగింది. అలాగే ఈనెల 3వ తేదీన నెలకొల్పిన దుర్గాదేవి విగ్రహాలను కొత్త నక్కవానిపాలెం, చిన ములగాడ, జవహర్‌నగర్ రెండు గుళ్ల వద్ద ఊరేగింపు కొనసాగించారు. మార్గమధ్యలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.


సీతారామ్‌నగర్‌లో ఊరేగింపు

అనాథలకు సాయహస్తం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: సామాజిక సేవలో భాగంగా ప్రవాస భారతీయుడు జి.సుధీర్‌రెడ్డి సోమవారం గాజువాకలోని స్ఫూర్తి అనాథబాలల ఆశ్రమానికి నెలరోజులకు సరిపడా నిత్యావసరాలు, పోషకాహారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో అనాథ బాలలు, అన్నార్తులకు సాయహస్తం అందజేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పలువురు యూత్ సభ్యులు పాల్గొన్నారు.


వితరణ కార్యక్రమంలో సభ్యులు




'సీ-ఫేస్' విన్యాసాలు

సింధియా, న్యూస్‌టుడే: సీ-ఫేస్ మలబార్-2024 విన్యాసాలు సోమవారం బంగాళాఖాతంలో జరిగాయని ఈఎన్‌సీ వర్గాలు తెలిపాయి. ఈ విన్యాసాల్లో భాగస్వామ్య దేశాలకు చెందిన వివిధ రకాల యుద్ధనౌకలు చురుగ్గా పాల్గొని అంతర్గత శక్తి సామర్థ్యాలను ప్రదర్శించినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి.

ప్రైవేటు వాహనాల పార్కింగ్‌తో అవస్థలు

గోపాలపట్నం, న్యూస్‌టుడే: ఎన్ఏడీ కూడలి నుంచి మర్రిపాలెం వెళ్లే బీఆర్టీఎస్ రోడ్డులో ప్రైవేటు వాహనాల అనధికార పార్కింగ్‌తో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రైవేటు పాఠశాల, కళాశాలల విద్యార్థులను గమ్యస్థానాలకు చేర్చుతున్న బస్సులు రాత్రివేళల్లో శాంతినగర్ నుంచి కరాస శ్మశానవాటిక వరకు పార్కింగ్ చేస్తున్నారు. ఈ మార్గంలోనే నైట్ ఫుడ్‌సెంటర్లను నిర్వహిస్తున్నారు. ఆ మార్గంలో బస్సులు పార్కింగ్ చేయడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ఢీకొంటున్నాయి.


శాంతినగర్ బీఆర్టీఎస్ రోడ్డులో నిలిపి ఉంచిన వాహనాలు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు స్పందన

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : పోలీసు సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు విశేష స్పందన లభించింది. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. తక్షణమే సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించటంలో అలసత్వం వహించవద్దని ఆదేశించారు. సోమవారం పోలీసు సమావేశమందిరంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 58 మంది బాధితులు హాజరై తమ వినతులు సమర్పించారు.

రాయితీ టమాటా తూకాల్లో తేడా: రైతులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాయితీ టమాటా విక్రయాల్లో నష్టాలు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. తూకాల్లో తేడా, నాణ్యత లేని సరకు కారణంగా బాస్కెట్‌కు 3 నుంచి 4 కిలోలు తగ్గిపోతున్నాయన్నారు. సోమవారం నర్సింహనగర్ రైతుబజార్ నుంచి పలువురు రైతులు కలెక్టరేట్‌కు వచ్చారు. రోజుకు ఒక్కో రైతుకు రూ.1000 నుంచి రూ.2వేల వరకు నష్టం వస్తోందని, ఇబ్బందులను మార్కెటింగ్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇచ్చిన సరకు విక్రయించాల్సిందేనని అధికారులు చెబుతున్నారని, న్యాయం చేయాలని కోరారు.

పేరుకున్న వ్యర్థాలు.. తప్పని కష్టాలు

సింధియా, న్యూస్‌టుడే: సింధియా, మల్కాపురం, శ్రీహరిపురం పరిసరాల గెడ్డలతో సహా ప్రధాన కాలువలన్నీ వ్యర్థాలతో దర్శనమిస్తున్నాయి. ఏకేసీ కాలనీ, మరిడిమాంబ గెడ్డ, ములగాడ కాలనీ, గుల్లలపాలెం, రాంనగర్ వీధుల్లో చెత్త కుప్పలు తిష్ఠ వేశాయి. గత రెండు రోజులుగా రాత్రిపూట కురుస్తున్న వర్షంతో తడిసిన వ్యర్థాల నుంచి దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దసరా సందర్భంగా శని, ఆదివారాల్లో సెలవు కావడంతో పారిశుద్ధ్య సిబ్బంది హాజరు అరకొరగా ఉన్న నేపథ్యంలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయిందని చెబుతున్నారు. మరింత ప్రమాదకర స్థితికి చేరకముందే తక్షణం శుభ్రత చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


మరిడిమాంబ గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు

మండపం తొలగింపులో అపశ్రుతి

గోపాలపట్నం, న్యూస్‌టుడే: దుర్గాదేవి మండపం తొలగింపులో అపశ్రుతి నెలకొని గోపాలపట్నం శంకర థియేటర్ యజమాని తీవ్ర గాయాలపాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గోపాలపట్నం శంకర థియేటర్ యజమాని మళ్ల సత్యనారాయణ(75) జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో కుటుంబ సభ్యులతో నివాసముంటున్నారు. దేవీ నవరాత్రుల్లో భాగంగా ఆయన ఇంటికి సమీపంలో ఏర్పాటు చేసిన మండపాన్ని నిర్వాహకులు తొలగిస్తున్నారు. కనీస భద్రత ప్రమాణాలు పాటించకుండా మండపాన్ని తొలగిస్తున్న క్రమంలో మళ్ల సత్యనారాయణ ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు కారు ఎక్కుతున్న సమయంలో మండపం కుప్పకూలిపోయింది. దాంతో ఆయన తలపై కర్రలు పడ్డాయి. బలమైన గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటీన నగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి బాగానే ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కారు స్వల్పంగా ధ్వంసమైనట్లు స్థానికులు తెలిపారు.

దశల వారీగా సమస్యల పరిష్కారం

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం): వార్డులోని సమస్యలను దశలవారీగా పరిష్కరించడానికి కృషి చేస్తానని 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ అన్నారు. వినోద్‌నగర్‌లో సుమారు రూ.17.80 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనుల విభాగ ఏఈ వెంకటలక్ష్మీ, వార్డు తెదేపా నాయకులు పాల్గొన్నారు.


స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ బొమ్మిడి రమణ

గాజువాక సినిమాలు..

కన్య: దేవర, హెవెన్: జనక అయితే గనక
శ్రీకన్య, లక్ష్మి, హెవెన్, అరుణ, అన్నపూర్ణ: వేట్టయన్, మోహినీ 70ఎంఎం: విశ్వం
లక్ష్మీకాంత్: స్వాగ్, మినీ మోహినీ: మార్టిన్
మోహినీ: జిగ్రా,
విశేష్: మా నాన్న సూపర్ హీరో

గోపాలపట్నంలో: శ్రీనరసింహ: జనక అయితే గనక, నరసింహ: వేట్టయన్
సౌజన్య: విశ్వం, సుకన్య: దేవర
మౌర్య: మా నాన్న.. సూపర్ హీరో

ఎస్టీబీఎల్‌లో: స్క్రీన్-2: వేట్టయన్
స్క్రీన్-3: విశ్వం, స్క్రీన్-4: దేవర
స్క్రీన్-1: మార్టిన్